



నకిలీ రేషన్ కార్డులు 4430

- ఉమ్మడి జిల్లాలో నకిలీలపై సర్వే
- రెండు రాష్ట్రాల్లో కార్డులపై ఆరా
- ఒక రాష్ట్రంలో తొలగింపు
- కేంద్ర గణాంకాలతో పరిశీలన

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):తెల్లరేషన్‌కార్డుల్లో నకిలీలను ఏరివేయనున్నారు.ఏపీతో పాటు వేరే రాష్ట్రంలోను రేషన్‌కార్డు పొంది అక్కడా.. ఇక్కడా కూడా లబ్ధిపొందుతున్న కొందరిపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్దఎత్తున డూప్లికేట్ రేషన్ కార్డులు ఉన్నట్టు తెలుస్తోంది. కేంద్రం గణాంకాల ఆధారంగా సర్వే చేయనున్నారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4430 డూప్లికేట్ తెలుపు రేషన్ కార్డులు ఉన్నట్టు నేషనల్ లెవెల్ డీ డూప్లికేట్ ఆఫ్ రేషన్‌కార్డు డేటా బేస్ ఆధారంగా గుర్తించారు. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒడిస్సా రేషన్ కార్డుల్లో సభ్యులుగా ఉన్నట్టు గుర్తించారు. వన్ నేషన్-వన్ రేషన్ కార్డు పేరిట నిర్వహించిన కార్యక్రమాల్లో కూడా ఇది బయట పడింది.కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు.డేటాను అనుసరించి రీసర్వే చేసి రెండు రాష్ట్రాల్లో కార్డులున్న వారి వివరాలను పంపాలని సూచించారు. దీనిపైఉమ్మడి తూర్పుగో దావరి జిల్లాలో వీఆర్వోలు సర్వే చేయనున్నారు.

డూప్లికేట్లతో పక్కదారి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి కాకినాడ జిల్లాలో 319, కోనసీమ 324, తూర్పుగోదావరి జిల్లాలో 269, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3518 డూప్లికేట్ రేషన్ కార్డులు ఉన్నట్టు కేంద్రం పంపిన నివేదికలో ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రీసర్వే చేసి ఆయా రేషన్‌కార్డుల్లో సభ్యులు ఇతర రాష్ట్రాల్లో ఉన్న రేషన్‌కార్డుల సభ్యులు ఒక్కరేనని ధ్రువీకరించిన తర్వాత రేషన్‌కార్డుల నుంచి కుటుంబ సభ్యులను తొలగిస్తారు. పేదలకు అందాల్సిన ఉచిత బియ్యం పథకం పక్కదారిన పడుతుందని పెద్ద ఎత్తున కేంద్రానికి ఫిర్యాదులు వెళ్లడంతో ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించింది. ఒకే వ్యక్తిగానీ, ఒకే కుటుంబంగానీ రెండు రాష్ట్రాల్లో రేషన్ తీసుకోవడంవల్ల ప్రభుత్వానికి పెద్దఎత్తున నష్టం జరుగుతుందని గుర్తించింది.ఈ విషయమై జిల్లా పౌరసరఫరాశాఖ అధికారి ఎంవీ ప్రసాద్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

కాకినాడ డీఆర్వోగా వెంకట్రావు



కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా జె.వెంకట్రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను ఇచ్చింది. ఇక్కడ పనిచేస్తున్న డీఆర్వో తిప్పేనాయక్‌ను జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. జె.వెంకట్రావు గతంలో మూడునెలలపాటు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన ఎన్నికల విధుల్లో కీలకంగా వ్యవహరించారు. తిరిగి మళ్లీ కాకినాడ డీఆర్వోగా నియమితులయ్యారు.

రామచంద్రపురం ఆర్డీవోగా అఖిల

రామచంద్రపురం ఆర్డీవోగా దేవరకొండ అఖిలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు ఆర్డీవోగా పనిచేసిన ఖతీబ్‌కౌసర్‌భానును తాడేపల్లిగూడెం ఆర్డీవోగా నియమిస్తూ బదిలీ చేశారు.

రేపు అభ్యుదయ కవి సోమసుందర్ శత జయంతి సభ

పోర్టుసిటీ(కాకినాడ),అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న ప్రముఖ అభ్యుదయ కవి అవంత్స సోమసుందర్ శత జయంతి సభ సాహితీ అకాడమీ క్రియా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని క్రియా కార్యదర్శి జగన్నాథరావు తెలిపారు. కాకినాడ గాంధీభవన్‌లో ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు సభ జరుగుతుందన్నారు. సభలో కేంద్రసాహిత్య అకాడమీ కన్వీనర్ పి.మృణాళిని, కవి నందిని సిద్ధారెడ్డి, చందు సుబ్బారావు, వాడ్రేవు వీరలక్ష్మీదేవి, నండూరి రాజగోపాల్‌తోపాటు ప్రముఖ సాహితీవేత్తలు, సోమసుందర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొననున్నారని తెలిపారు.

ఫుడ్ సేఫ్టీ విభాగంలో అపరాధ రుసుం

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో గురువారం ఫుడ్‌సేఫ్టీ విభాగంలో 15రకాల కేసులకు అపరాధ రుసుం విధించారు. జేసీ రాహుల్‌మీనా వారికి రూ.2లక్షల40వేల అపరాధ రుసుం విధించారు. అధికారులు శ్రీనివాస్, సుబ్బారావు పాల్గొన్నారు.

'పంటల బీమా'పై అవగాహన కల్పించాలి

» కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రబీసీజన్ 2024-25 పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన పెంపొందించి వారి పేర్ల నమోదు చేసుకునేలా చూడాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. రబీ సీజన్ 2024-25 పంటల బీమా పథకం అమలు తీరుపై వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ రాజశేఖర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, వ్యవసాయ శాఖ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో గురువారం అమరావతినుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి కాకినాడ కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ షాన్‌మోహన్ జేసీ రాహుల్‌మీనా, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి హాజరయ్యారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులతో కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ పంటల బీమా పథకానికి రైతులే స్వచ్ఛందంగా ప్రీమియం చెల్లించాలన్నారు. పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన పెంపొందించి రైతుల పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. డిసెంబరు 31వతేదీ నాటికి పంటల బీమా నమోదు ప్రక్రియ ముగించాలన్నారు. సీఎస్‌సీ సెంటరు, సచివాలయాలకు వెళ్లి రైతులు తమ ప్రీమియాన్ని చెల్లించవచ్చన్నారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, ఉద్యానవనశాఖ ఏడీ మల్లిఖార్జునరావు, సీపీవో త్రినాథ్, వ్యవసాయ, లీడ్‌బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అయితే మాకేంటి?

- కాకినాడ కార్పొరేషన్‌లో అధికారుల ఇష్టారాజ్యం
- వైసీపీ హయాంలో టీడీఆర్ బాండ్ల ముసుగులో అడ్డంగా సేకరించిన భూమిపై ఎనలేని ప్రేమ
- ఆ భూముల్లో చెత్తనుంచి గ్యాస్ తయారీ ప్రాజెక్టుకు కమిషనర్ ఓకే
- కమిషనర్ తీరుపై ఎమ్మెల్యే కొండబాబు గుర్రు: శంకుస్థాపనకు ఆగ్రహంతో గైర్హాజరు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

అవి కాకినాడ దుమ్ములపేటలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీఆర్ బాండ్ల పేరుతో అడ్డగోలుగా సేకరించిన భూములు. తమ వారికి మేలు చేసేందుకు అవసరం లేకపోయినా కార్పొరేషన్ ద్వారా రూ.215కోట్ల బాండ్లు జారీ చేయించి అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చక్రం తిప్పి కొనుగోలు చేయించారు. దీని వెనుక కుంభకోణంపై అప్పటినుంచీ టీడీపీ పోరాడుతోంది. ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి టీడీపీ ఎమ్మెల్యే కొండబాబు స్వయంగా ఫిర్యాదు చేసి భూబాగోతంపై విచారణ కోరారు. అటు టీడీఆర్ బాండ్ల ముసుగులో వైసీపీ ప్రభుత్వంలో కొనుగోలు చేసిన భూములపై ప్రభుత్వం ఒక్కొక్కటిగా విచారణ చేయిస్తోంది. ఈ తరుణంలో కాకినాడ కార్పొరేషన్ అధికారులు అయితే మాకేంటి.. అనుకున్నారు. సీఎం, ఎమ్మెల్యే ఏం చేస్తే మాకేంటి అన్నట్లు టీడీఆర్ బాండ్ల జారీ ద్వారా కొనుగోలు చేసిన భూముల్లో ఏకంగా చెత్తనుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌కు అనుమతులు ఇచ్చేశారు. ఇదంతా గుట్టుగా దాచేసి ఉన్నట్టుండి ఎమ్మెల్యే కొండబాబును గురువారం శంకుస్థాపనకు ఆహ్వానించారు. అవాక్కయిన ఎమ్మెల్యే అధికారుల తీరుపై ఆగ్రహంతో కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. అక్కడి వెళ్లిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దూరంగా నిలబడిపోయారు.

ఇదేం అడ్డగోలు తనం..

నాడు చేతిలో అధికారం ఉందని కాకినాడ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి అడ్డగోలుగా వ్యవహరించారు. ప్రభుత్వ అవసరాల ముసుగులో అస్మదీయులకు భారీగా లబ్ధి చేకూర్చారు. టీడీఆర్ బాండ్ల జారీ పేరుతో నిబంధనలకు పాతరేసి కోట్లలో స్వాహా చేసేశారు. తద్వారా కాకినాడ కార్పొరేషన్‌కు వందల కోట్లలో ఆదాయానికి గండి కొట్టేశారు. దీనికి నిలువెత్తు నిదర్శనమే కాకినాడ దుమ్ములపేటలో రూ.215కోట్ల టీడీఆర్ బాండ్లు జారీ చేసి సేకరించిన రూ.4.67ఎకరాలు. ప్రజోపయోగ అవసరాలకు మాత్రమే జారీ చేయాల్సిన టీడీఆర్ బాండ్లను గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా దుర్వినియోగం చేసింది. వాస్తవానికి కాకినాడ నగరానికి సమీపంలో దుమ్ములపేటలో ట్రాన్స్‌కో అధికారులు పరిశ్రమల అవసరాలకోసం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని అప్పట్లో నిర్ణయించారు. ఈ స్థలాన్ని ట్రాన్స్‌కో సమకూర్చుకోవాలి. కానీ ఓ ఇక్కడే ఎమ్మెల్యే ద్వారంపూడి చక్రం తిప్పారు. దుమ్ములపేటలో కాకినాడ యాంకరేజ్ పోర్టుకు చెందిన భూములు వందల ఎకరాల్లో ఉన్నా కాదని ప్రత్యేక ఆసక్తితో విద్యుత్‌సబ్ స్టేషన్‌కు ప్రైవేటు భూమి సేకరించాలని కార్పొరేషన్‌పై ఒత్తిడి తెచ్చాడు. దీనికి కమిషనర్ తలూపేశారు. అందులోభాగంగా దుమ్ములపేటలో సర్వే నెంబరు 1986 బై 3డీ2, టీఎస్ నెంబర్ 1989బై 1ఏ,4ఏలో 4.67ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించారు. గజం రూ.28వేల మార్కెట్ ధర చొప్పున 1:4నిష్పత్తిలో రూ.215కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లను సదరు ప్రైవేటు వ్యక్తికి జారీ చేయించారు. ఒకరకంగా ఇది భారీ కుంభకోణం. ప్రభుత్వ భూములున్నా కాదని, ఓ ప్రైవేటు వ్యక్తి భూమి తీసుకుని సదరు వ్యక్తి కంపెనీ పేరున రూ.215 కోట్లు బాండ్లు జారీ చేసేశారు. ఈ కుంభకోణంపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొండబాబు అప్పట్లో ఆందోళన చేపట్టారు. జనసేన, బీజేపీ నేతలు సైతం నిరసనలు చేపట్టారు. ఇటీవల ఎమ్మెల్యే కొండబాబు సీఎం చంద్రబాబును కలిసి టీడీఆర్ బాండ్ల పేరుతో కొనుగోలు చేసిన భూములపై విచారణ చేయించాలని కోరారు. ఆధారాలను సీఎంకు చూపించారు. దీంతో ఆ ఆధారాలను సీఎం కార్యాలయ అధికారి ముద్దాడ రవిచంద్రకు పంపించారు. ఇదే ఫిర్యాదును కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్‌కు ఎమ్మెల్యే అందించి విచారణ కోరారు. టీడీఆర్ బాండ్ల పేరుతో సేకరించిన భూములపై కూటమి ప్రభుత్వం ఇప్పటికే విచారణకు ఆదేశించింది.



కాకినాడ దుమ్ములపేటలో గత ప్రభుత్వం టీడీఆర్ బాండ్ల ద్వారా సేకరించిన భూమిలో బయోగ్యాస్ ప్లాంట్‌కు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కమిషనర్ భావన, ఎమ్మెల్సీ పద్మశ్రీ

ఇంత రాద్ధాంతం జరుగుతుంటే...

దుమ్ములపేట భూముల్లో ఇంత రాద్ధాంతం జరుగుతుంటే కార్పొరేషన్ కమిషనర్ మాత్రం తనదారి తనదే అన్నట్లు అడ్డగోలు వ్యవహరించారు. ఈ వివాదాస్పద భూముల్లో ఎమ్మెల్యేకు సమాచారం లేకుండా అందులో తడిచెత్తతో బయోగ్యాస్ ఉత్పత్తి చేసే కంపెనీకి ప్లాంట్ ఏర్పాటుకు అనుమతులు జారీ చేసేశారు. ఒకపక్క ఈ భూముల్లో అవినీతి వ్యవహారం సీఎం వరకు వెళ్లడం, స్థానిక ఎమ్మెల్యే దీనిపై పోరాడుతుండడం కనిపిస్తున్నా కమిషనర్, ఇతర అధికారులు అయితే మాకేంటి? అన్న తరహాలో నిర్ణయం తీసేసుకున్నారు. కార్పొరేషన్‌కు పలు చోట్ల భూములు ఉన్నా అవన్నీ కాదని టీడీపీ పోరాటం చేస్తున్న దుమ్ములపేట టీడీఆర్ భూముల్లో ఈ ప్లాంట్‌కు రెండెకరాలు కేటాయించడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ప్లాంట్‌కు కమిషనర్ గురువారం శంకుస్థాపన కూడా చేసేశారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలంటూ గురువారం ఉదయం ఎమ్మెల్యే కొండబాబును అధికారులు కోరారు. తాను పోరాటం చేస్తున్న, కార్పొరేషన్ నిధులు దుర్వినియోగం చేసిన భూముల్లో అధికారులు ప్లాంట్‌కు భూమి కేటాయించిన విషయం ఆలస్యంగా తెలిసి ఎమ్మెల్యే తీవ్ర అసహనం చెందారు. అధికారుల తీరుకు నిరసనగా శంకుస్థాపనకు వెళ్లలేదు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ అక్కడకు వెళ్లినా కార్యక్రమానికి దూరంగా నిలబడిపోయారు. అయినా కమిషనర్ తనకేం పట్టనట్లు తన మానాన తను ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీతో కలిసి శంకుస్థాపన చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. కూటమి ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు విలువ ఇవ్వకుండా కమిషనర్ ఇలా ఇష్టానుసారం చేయడంపై ఎమ్మెల్యే కొండబాబు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. టీడీఆర్ భూముల్లో రెండెకరాలు కట్టబెట్టడం ద్వారా పరోక్షంగా వైసీపీకి మేలు చేశారని భావిస్తున్నారు. కుంభకోణంపై విచారణ లేకుండా అంతా సక్రమేనని చూపించేలా కమిషనర్ వ్యవహరిస్తున్నారని గుర్రుగాఉన్నారు. దీన్ని పురపాలకశాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లగా అధికారులు తనకూ చెప్పలేదని తెలిపారు. త్వరలో సీఎంకు ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే నిర్ణయించారు.

బయోగ్యాస్ ఉత్పత్తి ప్లాంట్ రావడం శుభపరిణామం

» ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

కాకినాడ సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చెత్తనుంచి బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను కాకినాడలో ఏర్పాటు చేయడం శుభపరిణామమని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. దుమ్ములపేటలో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంలో రూ.20కోట్ల నిధులతో రోజుకు 40టన్నుల సామర్థ్యంతో ఏర్పాటుచేస్తున్న బయో-మెథనేషన్ ప్లాంట్ (వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్) నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ పద్మశ్రీ, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన గురువారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన ఎనర్గాన్‌లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీపాల్‌రెడ్డి, డి.అనంతశర్మ నిర్వహణలో ఈ ప్లాంట్ పనిచేయనుంది. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ బయోమెథనేషన్ ప్లాంట్ ఏర్పాటు కాకినాడకు ప్రత్యేకతను తేనుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ చెత్తనుంచి సంపద సృష్టించేలా తడి చెత్త నుంచి మీథేన్ గ్యాస్‌ను ఉత్పత్తి చేసి భవిష్యత్తులో పైప్‌లైన్ల ద్వారా కాకినాడ నగరవాసులకు అందుబాటులోకి తేనున్నామన్నారు. ఈ ప్రాజెక్టు పర్యావరణ కాలుష్యం, కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ కామేశ్వరరావు, ఈఈ మత్స్యరాజు, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో..

» కాకినాడలో సిటీ నియోజకవర్గ కూటమి విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కొండబాబు, పరిశీలకుడు రాంభూపాల్‌రెడ్డి

పేరాబత్తుల భారీ విజయానికి కృషి చేయాలి



కాకినాడ సిటీ నియోజకవర్గ కూటమి విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రానున్న ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ భారీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎన్నికల పరిశీలకుడు, రాయలసీమ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జరుగుతున్న ఓటరు నమోదు తదితర అంశాలపై కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో కాకినాడ సిటీ నియోజకవర్గ కూటమివిస్తృతస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కొండబాబు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాంభూపాల్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసినప్పటికీ మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఈ విషయాన్ని పట్టభద్రులు గుర్తించాలని సూచించారు. పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేయాలంటే కచ్చితంగా డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు గడువు పూర్తి కావాల్సి ఉందన్నారు. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ప్రసంగించారు. తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో కాకినాడ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, సూపర్ బజార్ ఛైర్మన్ గ్రెసింగి ఆదినారాయణ, కూటమి నాయకులు నాగిడి నాగేశ్వరరావు, సుంకర తిరుమలకుమార్, గ్రంధి బాబ్జి, తుమ్మల సునీత రమేష్, వొమ్మి బాలాజీ, కొండమూరి సత్యనారాయణ, గుత్తుల రమణ, నల్లూరి శ్రీనివాస్, పెంకే శ్రీనివాసబాబా, ఎంఎ తాజుద్దీన్, అడబాల సత్యనారాయణ, బచ్చు శేఖర్, అంబటి చిన్న, తలాటం సత్య, కర్రి పాపారావు, కొక్కిలిగడ్డ గంగాధర్, గాలిదేవర శేఖర్, దొడ్డి వీరేంద్ర, పి.రాజేశ్వరి, లీల పాల్గొన్నారు.

ఎలాంటి ప్రమాదాలు లేకుండా..

దీపావళి నిర్వహించాలి

» జిల్లా జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఎలాంటి ప్రమాద సంఘటనలు చోటు చేసుకోకుండా సురక్షితమైన వాతావరణంలో దీపావళి జరుపుకునేలా పటిష్టమైన ఏర్పాటు చేయాలని జిల్లా జేసీ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, అదనపు ఎస్పీ భాస్కరరావులతో కలిసి వివిధశాఖల అధికారులతో ఈనెల 31న జరుపుకోనున్న దీపావళి పండుగ ఏర్పాట్ల పర్యవేక్షణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌మీనా మాట్లాడుతూ జిల్లాలో గత ఆగస్టు, సెప్టెంబరు నెలలో జరిగిన వినాయక చవితి, దసరా పండుగలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా నిర్వహించామన్నారు. అదే స్ఫూర్తితో ఈనెల 31న జరుపుకోనున్న దీపావళి పండుగ సందర్భంగా అన్ని ముందస్తు జాగ్రత్తలతో కూడిన పటిష్టమైన చర్యలు ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖల ఆధ్వర్యంలో దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక పోస్టర్‌ను రూపొందించి బాణాసంచా షాపులవద్ద ప్రదర్శించాలని అధికారులకు స్పష్టం చేశారు. అనుమతి లేకుండా ఎవరూ బాణాసంచా తయారీ నిల్వ కేంద్రాలు నిర్వహించకుండా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపకశాఖలు నిశితమైన నిఘా, ఉమ్మడి తనిఖీలు నిర్వహించాలన్నారు. అన్ని బాణాసంచా కేంద్రాల వద్ద అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, జిల్లాఅగ్నిమాపక అధికారి సుబ్బారావు, డీఎంఅండ్ హెచ్వో నరసింహనాయక్, డీపీవో రవికుమార్ తదితరలు పాల్గొన్నారు.

ఏవీ నగరంలో అర్ధరాత్రి అలజడి 7

మారిన వాతావరణంతో..

రైతుల్లో కలవరం

ఈనిక దశ దాటి వరి కంకు గింజ గట్టిపడే దశలో ఉన్న వరి పంట



- వర్షాలు కురిస్తే పంటలకు నష్టం
- ఏలేరుకు పెరుగుతున్న ఇన్‌ఫ్లోస్

గొల్లప్రోలు/పిఠాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మారిన వాతావరణం రైతుల్లో కలవరాన్ని కలిగిస్తోంది. ధానా తుఫాన్ ప్రభావం జిల్లాపై ఉండదని వాతావరణశాఖ చెప్పినప్పటికీ వాతావరణంలో జరుగుతున్న మార్పులు ఆందోళనకు కారణమవుతున్నాయి. వరి సహా మెట్ట పంటలకు కీలకమైన ఈ తరుణంలో వర్షం పడితే నష్టం జరుగుతుందని చెబుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి దానా తుఫాన్‌గా మారిన నేపథ్యంలో వాతావరణంలో బుధ, గురువారాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. జిల్లాపై తుఫాన్ ప్రభావం పెద్దగా ఉండదని, ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాపై ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణశాఖ ఇప్పటికే తెలిపింది. ఆకాశం మేఘావృతమై ఉండడంతోపాటు బుధవారం రాత్రి జల్లులు పడ్డాయి. మంగళవారం ఇదే పరిస్థితి ఉంది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మబ్బు వాతావరణంగా ఉంది. పగటిపూట కూడా చలిగాలులు వీచాయి. సాయంత్రం మళ్లీ ఉక్కపోత ఏర్పడింది. ఈ వాతావరణ పరిస్థితులే రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో ప్రస్తుతం వరి పంట ఈనిక దశను దాటి వరి కంకు గట్టిపడే దశలో ఉంది. ఈ దశలో వర్షం పడితే గింజ పొల్లుబారిపోతుంది. అదే సమయంలో పంటపై తెగుళ్ల ప్రభావం అధికంగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మెట్ట పంటలది అదే పరిస్థితి

మెట్టప్రాంతాల్లో వేసిన పత్తి, మిర్చి, నువ్వులు, కాయగూరల పంటలు కీలకదశలో ఉన్నాయి. పత్తి పంట పూత, కాయ దశలో ఉంది. ఇప్పుడు వర్షం పడితే పూత రాలిపోవడంతోపాటు కాయలు పగిలిపోతాయి. దీని వల్ల మొదటి విడత దిగుబడులను రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది. కాయగూరల పంటలు పూత, కాసే దశలో ఉన్నాయి. భారీ వర్షం పడితే తీవ్రంగా నష్టపోతామని రైతులు చెబుతున్నారు.

ఏలేరుకు పెరుగుతున్న ఇన్‌ఫ్లోస్

ఏలేరు రిజర్వాయర్‌కు మళ్లీ ఇన్‌ఫ్లోస్ పెరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాలనుంచి 1644 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇప్పటివరకూ 1100 క్యూసెక్కులు మాత్రమే దిగువకు విడుదల చేసిన అధికారులు గురువారం నుంచి 2800 క్యూసెక్కులకు పెంచారు. ఏలేరు కాలువలకు 2వేల క్యూసెక్కులు, డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా విశాఖ తాగునీటి అవసరాలకు 200 క్యూసెక్కుల నీటిని పంపుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇన్‌ఫ్లోస్ పెరిగే అవకాశం ఉందని, అందుకే ముందు జాగ్రత్త చర్యగా నీటి విడుదలను పెంచామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

వీసీల నియామకంలో
ఎందుకీ ఆలస్యం?
● ఇన్‌ఛార్జి వీసీల పాలనలోనే విశ్వవిద్యాలయాలు
● నేటిలోగా సెర్చ్ కమిటీ సభ్యుడి పేరు ప్రతిపాదించాలి
6



మధుమేహం ఉన్నా.. 'మధురంగా'

మార్కెట్‌లో ఆకర్షిస్తున్న డయాబెటిక్ స్వీట్స్

తీపి తిన్నామనే ఫీల్ పొందొచ్చు

అందులో పంచదార కంటే.. తక్కువ చక్కెరనిచ్చే పదార్థాలు

ఇవి ఆలస్యంగా అరగడం వల్ల తక్కువ షుగర్ లెవెల్స్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తీపి అంటే ఎవరికి చేదు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనాసరే స్వీట్ అంటే ఇష్టమే. ముఖ్యంగా గోదావరి జిల్లాల ప్రజల జీవన శైలిలో తీపి ఓ భాగం. శుభకార్యక్రమం గురించి చెప్పేటప్పుడు, అభినందించేటప్పుడ నోటిని తీపి దనం చేస్తారు. బంధువులు, మిత్రుల ఇళ్లకు వెళ్లేటప్పుడు కూడా చాలామంది స్వీట్స్ తీసుకుని వెళ్తారు. ఫంక్షన్ల భోజనాల్లో స్వీట్లు లేకుండా వడ్డన ఉండదు. పండుగలకు స్వీట్ తప్పనిసరిగా ఉంటుంది. చివరకు పరామర్శలకు వెళ్లేటప్పుడూ పంచదారో, స్వీటో వంటి తీపి పదార్థాలను తీసుకువెళ్తారు. అంటే షడ్‌రుచుల్లో తీపి ఒకటి. ప్రధానమైనది కూడా. కానీ మధుమేహ (చక్కెర.. డయాబెటీస్) వ్యాధితో బాధపడుతున్న వారికి స్వీట్ ఓ ప్రమాదకర పదార్థమైపోయింది. స్వీట్ తినడంవల్ల షుగర్ లెవల్స్ పెరిగి ప్రాణాంతక పరిస్థితులు కూడా ఏర్పడతాయి. వైద్యులు కూడా స్వీట్లు తినవద్దని హెచ్చరిస్తారు. పంచదార ఉండే ఏ పదార్థాలు, దుంపలు వంటి కూరలు కూడా కట్టడి చేస్తారు. కానీ రుచికి అలవాటు పడిన నాలుకను ఆపడం కష్టమే. స్వీట్ తినే అదృష్టం కూడా లేదని గతంలో వారంతా తెగ బాధపడిపోయేవారు. ఒక్కొక్కరు ఉండలేక ఓ స్వీట్ తినేయడం.. టాబ్లెట్ వేసుకోవడం కూడా చేస్తున్నారు. కానీ కొంతకాలంగా డయాబెటీస్ బాధితుల నోటిని తీపిచేస్తూ వారికి షుగర్ లెవల్స్ పెరగకుండా చేస్తూ ఉండే స్వీట్లు కూడా మార్కెట్‌లోకి వచ్చాయి. దీంతో చాలా మంది మనస్సు కుదుటపడింది. మార్కెట్‌లో డయాబెటీస్ స్వీట్లు పేరిట షుగర్‌ఫ్రీ స్వీట్లు, బిస్కెట్లు, చాక్లెట్లు కూడా మార్కెట్‌లో ఉన్నాయి. స్వీట్లలో డయాబెటిక్ కాజా, సున్నుండలు, కోవా, కాజూబర్ఫీ, మోతీచూర్ లడ్డూ వంటివి అందుబాటులో ఉన్నాయి. కానీ ఇవి పూర్తిగా స్వీట్‌లెస్ స్వీట్లు కావు. ఈ పదార్థాల్లో పంచదారశాతం తక్కువ. ఆలస్యంగా అరుగుతాయి. అందువల్ల తిన్న వెంటనే ప్రభావం చూపవు. ఆలస్యంగా కొద్ది ప్రభావం మాత్రమే చూపుతాయి.

ఇవి ఎలా తయారు చేస్తారంటే..

ఈ స్వీట్లలో పంచదార వినియోగించరు. మార్కెట్‌లో లభ్యమయ్యే టాటాఫోసెన్స్, స్వీట్ మేకర్, హాఫ్ షుగర్ వంటి మార్కెట్‌లో రెడీమేడ్‌గా దొరికే పదార్థాలతో తయారుచేస్తారు. ఇది కొంత వరకూ డయాబెటిక్ బాధితుల నోటిని తీపి చేసుకోవచ్చు. టాటాఫోసెన్స్ లిక్విడ్ రూపంలో ఉంటుంది. దీంతో గులాబ్‌జామ్, కాజాలు వంటివి తయారు చేస్తారు. పంచదారలో 100శాతం పంచదార ఉంటే, బియ్యంలో 70శాతం వరకే ఉంటుంది. టాటాఫోసెన్స్‌లో 18శాతం మాత్రమే ఉంటుంది. అందువల్లే దీంతో తయారు చేసే స్వీట్లకు మార్కెట్ పెరిగింది.

ప్రత్యామ్నాయం.. డైట్ షుగర్

మార్కెట్‌లో పంచదారకు ప్రత్యామ్నాయంగా డైట్ షుగర్ వచ్చింది. ఇది పంచదారలాగే ఉంటుంది. గరుకుతనం కాస్త తక్కువ. స్వీట్‌నెస్ ఎక్కువ. దీంతో కోవా, క్యాజూబర్ఫీ వంటివి తయారు చేసుకోవచ్చు. కాఫీ, టీలలో వాడొచ్చు. మార్కెట్‌లో రెలిష్, నేచురా, గ్రీన్స్, షుగర్ లైట్ వంటి పేర్లతో వీటిని విక్రయిస్తున్నారు.

ఆఫ్ షుగర్

ఇది కూడా పంచదారలాగే ఉంటుంది. పంచదారలో ఉండే కాలరీస్‌లో సగమే ఉంటాయి. పంచదారలాగే తియ్యగా ఉంటుంది.

జలాటో

జలాటో అనేది ఐస్‌క్రీమ్‌లా ఉంటుంది. దీన్ని ఇటాలియం డిజట్ అంటారు. కానీ ఇది ఐస్‌క్రీమ్‌లా గట్టిపడదు. స్పూన్‌తోనే తినవచ్చు.

● నెమ్మదిగా అరుగుతాయి..



వాస్తవానికి డయాబెటీస్ స్వీట్ల కంటే మామూలు స్వీట్లే తీయగా ఉంటాయి. డయాబెటిక్ స్వీట్లలో చక్కెర శాతం తక్కువ ఉంటుంది. అసలు ఉండకుండా లేదు. కానీ డయాబెటీస్ స్వీట్లు నెమ్మదిగా అరుగుతాయి. పంచదారలా వెంటనే శరీరంలో కలిసిపోవు. అందువల్లే మధుమేహ బాధితులు వీటిని తిన్నా, పెద్దగా షుగర్‌లెవ్స్ పెరగవు.

-పోలిశెట్టి మల్లిబాబు, సురుచి అధినేత

కత్తి కట్టి.. ఆరేళ్లు!

నేటికీ తేలని కోడి కత్తి కేసు.. కేసు తేలకుండానే శ్రీనివాసరావుకు ఐదేళ్లు జైలు శిక్ష



కోడి కత్తి కేసు సంఘటన జరిగి గురువారం నాటికి ఆరేళ్లు పూర్తయ్యింది. అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌పై విశాఖ విమానాశ్రమంలో కోడికత్తితో శ్రీను దాడిచేశాడన్నది అభియోగం. ఈ కేసులో మాజీ సీఎం జగన్మోహనరెడ్డి కోర్టుకు హాజరై తన వాదన చెప్పక పోవడంతో ఆ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. జగన్ తరపు న్యాయవాదులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేయడంతో కేసు కోర్టులో వాయిదా పడుతూనే వస్తోంది. ప్రస్తుతం జగన్మోహనరెడ్డి సాధారణ ఎమ్మెల్యే అయినా కోర్టులో విచారణకు హాజరు కాకపోవడానికి ఏమిటి ఇబ్బందని నిందితుడు తరుపు న్యాయవాది సలీం, కుటుంబసభ్యులు, దళిత సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. మంత్రిగా ఉన్న నారా లోకేశ్ పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరవుతున్నారు కదా? ఆయనకు లేని ఇబ్బంది జగన్‌కే ఏంటని వారు పేర్కొంటున్నారు.

ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆ రోజు 2018, అక్టోబరు 25వతేదీ. విశాఖపట్నం విమానాశ్రయంలో నాటి ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహనరెడ్డిపై కోడికత్తి దాడి జరిగింది. జగన్ వీరాభిమాని అయిన ముమ్మిడివరం మండలం ఠానేలంక పెదపేటకు చెందిన జనిపల్లి శ్రీనివాసరావు విశాఖపట్నం విమానాశ్రయంలో చెఫ్‌గా పనిచేసేవాడు. ఉత్తరాంధ్ర పర్యటనలో ఉన్న జగన్ హైదరాబాద్ కోర్టుకు వెళ్లేందుకు విశాఖ విమానాశ్రయంలో వీఐపీ లాంజ్‌లో కూర్చున్న సమయంలో శ్రీనివాసరావు మీ అభిమానిని అంటూ ఆయన దగ్గరకు వెళ్లి మాటలు కలిపి కోడి కత్తితో దాడి చేయగా జగన్ వ్యక్తిగత భద్రత సిబ్బంది, సీఐఎస్ఎఫ్ అధికారులు అప్రమత్తమై శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడి సమయంలో జగన్‌కు ఎడమ భుజంపై చిన్న గాయమైంది. దీనిపై జగన్ అప్పుడు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చెయ్యలేదు. అక్కడ ప్రథమ చికిత్స చేయించుకుని హైదరా బాదులో మెరుగైన వైద్యం చేయించుకుంటానని వెళ్లిపోయారు. ఆ తర్వాత శ్రీనివాసరావు నా గొంతు కొయ్యబోయాడని జగన్ ఆరోపించగా జగన్‌పై హత్యాయత్నం చేసిందని శ్రీనివాసరావు అని చేయించింది క్యాంటీన్ ఓనర్ హర్షవర్ధన్ అని, హర్షవర్ధన్ టీడీపీ నాయకుడేనంటూ వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం, ధర్నాలు చేపట్టడం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ సంఘటనపై ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదుచేశారు. విశాఖపట్నం సిట్ (ప్రత్యేక దర్యాప్తు సంస్థ) దర్యాప్తు చేపట్టింది. ఆ తర్వాత ఎన్ఐఏ(జాతీయ దర్యాప్తు సంస్థ) కూడా మరో కేసు నమోదు చేసింది. కేసు విచారణ తర్వాత 2019, మే 25న శ్రీనివాసరావుకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 2019, ఆగస్టు 13న ఎన్ఐఏ అధికారులు విచారణ కోసం శ్రీనివాసరావు బెయిల్ రద్దు చేశారు. న్యాయం చేయాలని శ్రీనివాసరావు కుటుంబసభ్యులు అప్పటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు ఒక లేఖ రాశారు. వాస్తవ పరిస్థితులు తెలపడానికి వీరు జగన్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. 2022, సెప్టెంబరు 26న శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు జగన్‌ను కలవడానికి అనుమతి ఇచ్చి తరువాత నిరాకరించారు. ఈ క్రమంలో 2023 నవంబరు 28న ఎన్ఐఏ కోడి కత్తి దాడిలో కుట్రకోణం లేదని హైకోర్టుకు నివేదించింది. శ్రీనివాసరావు తప్ప ఇతర వ్యక్తుల పాత్రకానీ, రాజకీయ పార్టీల ప్రమేయంకానీ లేదని ఎన్ఐఏ తేల్చి చెప్పింది. 2023, ఆగస్టు 1న ఈ కేసు విజయవాడనుంచి విశాఖ ఎన్ఐఏ కోర్టుకు బదిలీ అయ్యింది. జను పల్లి శ్రీనివాసరావు తల్లి సావిత్రి, సోదరుడు సుబ్బరాజు శ్రీనివాసరావు బెయిల్‌కు జగన్ కోర్టుకు హాజరై తన సాక్ష్యం చెప్పాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో వారు నిరహారదీక్ష చేపట్టగా శ్రీనివాసరావు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో నిరహారదీక్ష చేపట్టారు. వారి దీక్షను పోలీసులు భగ్నం చేసి బలవంతంగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై దళిత సంఘాలు ఆందోళన చేపట్టారు. శ్రీనివాసరావు విషయంలో జైలు అధికారులు తీరు అనుమానాస్పదంగా ఉందని విశాఖ దళిత సంఘం ఐక్యవేదిక ఆందోళన వ్యక్తం చేసింది. దళిత సంఘాలు, మైనార్టీ హక్కుల సంక్షేమ సంఘం, సమత సైనికదళ్, న్యాయవాది సలీం పోరాట ఫలితంగా 2024 ఫిబ్రవరి 9న శ్రీనివాసరావుకు కోర్టు కండిషన్ బెయిల్ మంజూరు చేసింది. ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం పెట్టి వెళ్లాలనే నిబంధన విధించారు. ఐదేళ్ల 14రోజులు శ్రీనివాసరావు కోర్టు శిక్ష విధించకుండానే జైలు జీవితం అనుభవించాడు. కేసు మాత్రం నేటికీ తేలలేదు.

జైల్లో ఉన్నత చదువులు

ఇక శ్రీనివాసరావు జైల్లో ఉండగా బీఏ డిగ్రీ, ఎంఏ సోషాయాలజీ పూర్తిచేశాడు. తనకు జరిగిన అన్యాయంపై సమాజంలో మంచి కోసం పోరాటం చేసేందుకు తాను సోషియాలజీ చదివినట్టు శ్రీనివాసరావు పేర్కొంటున్నాడు. వారం రోజుల్లో శ్రీనివాసరావు అతడి కుటుంబసభ్యులు ముఖ్యమంత్రిని కలిసి పరిస్థితిని వివరించేందుకు సమాయత్తం అవుతున్నట్టు సమాచారం. ఐదేళ్లుగా ఆర్థికంగా, సామాజికంగా తాము పడుతున్న ఇబ్బందిని వివరించనున్నారు. ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయడం ఎంతో ఇబ్బందిగా ఉందని, తనకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని సామాజిక న్యాయంపై శ్రీనివాసరావు ఒక పుస్తకం రాస్తున్నట్టు తెలిసింది.



స్వగ్రామం రాణేలంక పెదపేటలో కుటుంబ సభ్యులు న్యాయవాదితో శ్రీనివాసరావు (ఫైల్‌ఫోటో)



వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న వేద పండితులు. పక్క చిత్రంలో తిరుప్పావడ సేవ జరుపుతున్న దృశ్యం



సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

వైభవంగా తిరుప్పావడ సేవ

వాడపల్లిలో నాల్గో రోజు ఘనంగా బ్రహ్మోత్సవాలు

యోగ నారసింహ అలంకరణలో శ్రీవారి సింహ వాహనసేవ

ఆకట్టుకున్న పలు సాంస్కృతిక ప్రదర్శనలు

ఆత్రేయపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు నాల్గవ రోజు గురువారం కూడా ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించిన వసంత మండపంలో కొలువుతీరి పూజలు అందుకున్నారు. ఖండవల్లి రాజేశ్వర ప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు క్రతువు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, అష్టకలశారాధన, ప్రధాన హోమాలు, దిగ్దేవ బలిహరణ తదితర కార్యక్రమాలను వైభవంగా జరిపారు. స్వామి వారి అంతరాలయంలో తిరుప్పావడ సేవా కాలం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా జరిపారు. సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, బలిహరణ తదితర కార్యక్రమాలు వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. స్వామివారి క్షేత్రం ఫలపుష్ప విద్యుత్ కాంతులతో చూపరులను ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారుల ప్రదర్శనతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కనకదుర్గాదేవి దంపతుల చేతుల మీదుగా బ్రహ్మోత్సవ పూజలు జరిపారు. అనంతరం యోగ నార సింహ అలంకరణలో శ్రీవారు సింహ వాహనంలో కొలువదీరారు. బాణసంచా కాల్పులు, భక్తుల గోవింద నామస్మరణ, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య తిరుమాడవీధుల్లో సింహ వాహనసేవ జరిపారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో ముదునూరి వెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం, మంగాదేవి దంపతులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



పూజలు చేస్తున్న ఉపకమిషనరు చక్రధరరావు దంపతులు

వాడపల్లిలో నేడు..

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం గోదావరి నదీ జలాసంగ్రహణము, మహాలక్ష్మి హోమము, మలయప్ప అలంకరణతో స్వామివారి గరుడ వాహనసేవ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

27న యానాంలో కవిసంధ్య స్వర్ణోత్సవ సభ

● హాజరుకానున్న ప్రముఖులు ● 13మందికి ప్రతిభా పురస్కారాలు

యానాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): యానాం కేంద్రంగా వెలువడుతున్న కవిసంధ్య, కవిత్వ పత్రిక స్థాపించి 50 సంచికలు పూర్తి చేసుకున్న సందర్భంగా 27న యానాంలో కవిసంధ్య స్వర్ణోత్సవ సభను నిర్వహిస్తున్నట్టు కవిసంధ్య సంపాదకుడు కళారత్న డాక్టర్ శిఖామణి, పురస్కార కమిటీ అధ్యక్షుడు దాట్ల దేవదానం రాజులు తెలిపారు. యానాం గీతా భవన్‌లో ఆదివారం ఉదయం 9.30 గంటలకు సభ జరగనుంది. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ, వాడ్రేవు చినవీరభద్రుడు, పాయల మురళీకృష్ణలకు కవితా పురస్కారాల ప్రదానం, శిఖామణి మలయాళ కవిత్వ గ్రంథావిష్కరణ, కవి సమ్మేళన కార్యక్రమాలు జరగనున్నాయి. కవి సంధ్య సంపాదకుడు కళారత్న శిఖామణి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ దీర్ఘాశి విజయ్‌భాస్కర్, డాక్టర్ సి.మృణాళిని, డాక్టర్ వీరలక్ష్మీదేవి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి మంగేష్, డాక్టర్ ఆర్.సీతారం తదితరులు హాజరుకానున్నారు. కవి సంధ్య ప్రతిభా పురస్కార గ్రహీతలు వీరే.... ఈ సందర్భంగా 13 మంది (వచన, అభ్యుదయ, పత్రికా, లఘు కవిత, దళిత సాహిత్యం తదితర)కి ముఖ్య అతిథుల నుంచి కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరిలో కొమ్మవరపు విల్సన్‌రావు, కపిల రాంకుమార్, పోనుగుమట్ల విష్ణుమూర్తి, ఎన్.ఈశ్వరరెడ్డి, కాళ్ళకూరి శైలజ, జీవీ రత్నాకర్, మార్ని జానకిరామచౌదరి, మోకా రత్నరాజు, సరికొండ నరసింహరాజు, కోలాటి పెద్దిరాజు, కొండూరి రమరాజు, ఎస్వీ రామశాస్త్రి ఉన్నారు.

అన్నవరం వచ్చిన ఉద్యోగులకు పోస్టింగ్‌లు

అన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇతర దేవస్థానాల నుంచి అన్నవరం దేవస్థానానికి వచ్చిన ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇస్తూ గురువారం ఈవో రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీపై తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్‌లు వచ్చారు. మరో 9 మందికి వేరే విభాగానికి మార్చినట్టు అధికారులు తెలిపారు.

హుండీల ఆదాయం రూ.16.12 లక్షలు

సామర్లకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో 225 రోజులకు హుండీల ద్వారా రూ.16 లక్షల 139తో పాటు, విదేశీ కరెన్సీ రూ.12,492 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు గురువారం తెలిపారు. దేవదాయ తనిఖీ అధికారి ఫణి కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ఉండూరుకు చెందిన లక్ష్మీ నారాయణ సేవా సంఘం భక్తులు ఉదయం నుంచీ హుండీలు లెక్కించారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

వీసీల నియామకంలో.. ఎందుకీ ఆలస్యం?



● ఇన్‌ఛార్జి వీసీల పాలనలోనే విశ్వవిద్యాలయాలు

● వర్సిటీలకు వీసీల నియామక సన్నాహాల్లో కూటమి ప్రభుత్వం

● నేటిలోగా సెర్చ్ కమిటీ సభ్యుడి పేరు ప్రతిపాదించాలి

జేఎన్టీయూకే, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో వీసీల నియామకంలో జాప్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖలో మార్పులు, సంస్కరణలు దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు రాజీనామా చేయాలని అనధికారికంగా మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో రాష్ట్రంలోని 17 వర్సిటీల వీసీలు రాజీనామా చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ జేఎన్టీయూకే వీసీ, రాజానగరంలోని అక్నూ వీసీలు కూడా రాజీనామా చేశారు. ప్రస్తుతం జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీగా ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, నన్నయ విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వీసీగా ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, జేఎన్టీయూకే మరో ప్రొఫెసర్ కృష్ణా విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీగా కొనసాగుతున్నారు.

వీసీ పదవికి 20 దరఖాస్తు

రెగ్యులర్ ఉపకులపతుల నియామకం కోసం జేఎన్టీయూకే నుంచి 20మందికిపైగా రాష్ట్ర ఉన్నత విద్యామండలికి దరఖాస్తు చేసినట్లు సమాచారం. దరఖాస్తు చేసిన వారందరూ వీసీ పదవి కోసం రాజకీయంగా, సామాజికవర్గపరంగా పలుకుబడి ఉన్నవారితో పైరవీలు చేస్తున్నారు. మంత్రి నారాలోకేశ్‌తో సన్నిహిత సంబంధాలున్న జిల్లాకు చెందిన రాజకీయ నాయకుల ద్వారా తమ బయోడేటాలను ఆయనకు పంపిస్తున్నారు.

సెర్చ్‌కమిటీలో ముగ్గురు సభ్యులు

విశ్వవిద్యాలయాల సెర్చ్ కమిటీ సభ్యుడి పేరును శుక్రవారం లోపు ప్రతిపాదించాలని ఏపీఎస్సీహెచ్‌ఈ నుంచి వర్సిటీలకు ఆదేశాలు వచ్చాయి. విశ్వవిద్యాలయాల పాలకమండలి సమావేశంలో సభ్యుడి పేరును తీర్మానించాలి. ఈసీ సూచించే సెర్చ్ కమిటీ సభ్యుడు విశ్వవిద్యాలయంలో ఆచార్యుడు కాకుండా ఉండాలి. ఇతర వర్సిటీల ఆచార్యులను పాలక మండలి సెర్చ్ కమిటీ సభ్యుడిగా నియమించాలి. ఉపకులపతుల ఎంపికకు సెర్చ్‌కమిటీ సూచనలు చేస్తుంది. దీనిలో ముగ్గురు సభ్యులుంటారు. యూజీసీనుంచి ఒకరు, ప్రభుత్వం నుంచి ఒకరు, వర్సిటీ నుంచి మరొకరిని పాలక మండలి ప్రతిపాదిస్తుంది. వీసీ పదవి కోసం ప్రొఫెసర్లు చేసిన దరఖాస్తులను సెర్చ్ కమిటీ పరిశీలిస్తుంది. వారి అనుభవం, పరిశోధనలు వంటి అంశాలను పరిశీలించి రాష్ట్ర ఉన్నత విద్యామండలికి సూచనలిస్తారు. అనంతరం ఉన్నత విద్యామండలి సీఎంకు పంపగా రాష్ట్రంలోని ఒక్కో యూనివర్సిటీకి వీసీ కోసం మూడేసి పేర్లను సూచిస్తూ ఆ ఫైల్‌ను గవర్నర్‌కు పంపగా ఆయన వీసీలను నియమిస్తారు.

ఇక రుడా వెంచర్లు

పీపీపీ విధానంలో అభివృద్ధి

అక్రమ లేఅవుట్లకు అనుమతులు ఇవ్వొద్దు

తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రుడా వెంచర్లు వేసి పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్, రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(రుడా) చైర్‌పర్సన్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం రుడా నిర్వహించిన ఐదో బోర్డు సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను రుడాకు స్వాధీనం చేసే విధానంపై ఆలోచించాలన్నారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో అనధికార లేఅవుట్లను గుర్తించాలన్నారు. రుడా పరిధిలో దరఖాస్తుల సమయంలో యూజర్ చార్జీల కింద వసూలు చేసే మొత్తాన్ని రూ.500 నుంచి రూ.1000కు పెంచినట్లు తెలిపారు. రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విధానంతో చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో రుడా సెక్రటరీ శైలజ, టూరిజం ఆర్డీ వి.స్వామినాయుడు, ఇన్‌చార్జి డీజీవో ఎం.నాగలత, ట్రాన్స్‌కో ఎస్ఈ కె.తిలక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ అండర్-14 బాలురు, బాలికలు జిల్లా జట్ల ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్‌లో అండర్-14 బాలురు, బాలికల విభాగాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్ల ఎంపికలను గురువారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 11న శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, డీవైఈవో ఈవీవీఎస్ఎన్‌బీఎల్ నారాయణ, డీఐ బి.దిలీప్‌కుమార్, జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్, కార్యదర్శి నాగరాజు, ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్పాట్ అడ్మిషన్లు కల్పించాలని వినతి

దివాన్‌చెరువు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పీజీ సెట్ రాయని అభ్యర్థులకు విశ్వవిద్యాలయంలో పీజీ చదువుకునేలా స్పాట్ అడ్మిషన్లు కల్పించాలని ఉప కులపతి శ్రీనివాసరావుకు అనూరా అలూమ్ని (పూర్వ విద్యార్థుల సంఘం) అధ్యక్షుడు గాదె కిషోర్, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ కె.కమలకుమారి, కార్యదర్శి, స్పృహ అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర నాగేంద్రకిషోర్ వినతిపత్రం అందజేశారు. పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సుల్లో భర్తీకాని సీట్లకు ఏపీ పీజీసెట్ రాయని అభ్యర్థులకు కూడా స్పాట్ అడ్మిషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులను పరిశీలించి ఆ మేరకు చర్యలు తీసుకుంటామని వీసీ చెప్పారు.



గుమ్మళ్లదొడ్డిలో రహదారిపై బైఠాయించిన ఆందోళనకారులు

ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి శ్రీనివాసరావు

అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం



గోల్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంటును గురువారం ఆయన గోల్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉమ్మడిగోదావరి జిల్లాల్లో నన్నయ విశ్వవిద్యాలయం తరపున 42 రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంతో ప్రతిభావంతులైన గ్రామీణ యువత వెలుగులోకి వచ్చి ఉన్నత స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పురుషుల టోర్నమెంట్-కమ్-విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలకు వివిధ కళాశాలల నుంచి 13 జట్లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు హాజరయ్యారన్నారు. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో ప్రతిభ కనబరిచిన జట్టు వచ్చే నెల 1నుంచి 5వ తేదీ వరకు బెంగళూరులోని క్రిస్ట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, క్రీడా బోర్డ్ ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీఎస్ఎన్ మూర్తి, ఎంపిక కమిటీ సభ్యులైన రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకుడు రమణ, విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

అస్సాగో బ్యాక్

ఇథనాల్ పరిశ్రమను తొలగించే వరకు దీక్ష విరమించేది లేదు

ఉద్యమ ప్రతినిధులు శివగణేష్, సూర్యచంద్ర, శ్రీదేవి స్పష్టీకరణ

అస్సాగో కంపెనీ ముట్టడికి నిరసనకారుల యత్నం

గుమ్మళ్లదొడ్డిలో భారీ ర్యాలీ.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



ఆందోళనకారులతో చర్చిస్తున్న ఆర్డీవో కృష్ణానాయక్

గోకవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాలుష్య కారకమైన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి స్థానికులకు పూర్తి విముక్తి కలిగే వరకు దీక్ష విరమించబోమని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమ నేత పాటంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో ఇథనాల్ పరిశ్రమ నిర్వహణకు వ్యతిరేకంగా చేపట్టిన నిరవధిక దీక్ష గురువారం మూడో రోజుకు చేరుకుంది. శిబిరాన్ని గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు సందర్శించి సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా పరిశ్రమ నిర్వహణను ప్రోత్సహించేలా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు.

మూడు రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న శివగణేష్, సూర్యచంద్ర, శ్రీదేవి ఆరోగ్యం క్షీణిస్తోంది. రక్తప్రసరణ, షుగర్ లెవెల్స్ క్రమంగా తగ్గుతున్నాయి. ప్రభుత్వ వైద్యులు వారికి గంట గంటకు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

దీక్షా శిబిరం వద్ద నుంచి కంపెనీని ముట్టడించేందుకు నిరసనకారులు భారీ ర్యాలీగా బయల్దేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద ఎత్తున చేరుకుని ప్రధాన రహదారిపై అడ్డుకున్నారు. దీంతో సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయ ఏర్పడింది. ఆ సమయంలో ఇతర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు కంపెనీ నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామంటూ నిరసనకారులకు మద్దతు తెలిపారు.

అస్సాగో పరిశ్రమను రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణానాయక్ పరిశీలించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి బాధితులతో చర్చించారు. పరిశ్రమ ఏర్పాటుతో కలుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం కమిటీని ఏర్పాటు చేసి తద్వారా పరిష్కార మార్గం చూపుతామని బాధితులకు సూచించారు. కమిటీ ఏర్పాటును నిరసనకారులు పూర్తిగా విభేదించారు. కంపెనీని పూర్తిగా తొలగించే వరకు నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

అస్సాగో సమస్య పరిష్కారానికి కమిటీ: కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమ సమస్య పరిష్కారానికి ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం ఆమె తన చాంబర్‌లో పరిశ్రమలు, పర్యావరణ శాఖల అధికారులతో సమీక్షించారు. కమిటీలో సమన్వయ శాఖల అధికారులు, గ్రామస్తులు, పరిశ్రమ ప్రతినిధులు ఉంటారన్నారు. ఇది పరిశ్రమలో కాలుష్య ప్రభావం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, గ్రామస్తుల అభ్యంతరాలపై అధ్యయనం చేస్తుందన్నారు. అధికార బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపడుతుందని చెప్పారు. సమావేశంలో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, జిల్లా పరిశ్రమల అధికారి రామన్, ఉమ్మడి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఎంటీఎస్ శంకరరావు, ప్రమోనల్ అధికారి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం గుట్టు... రట్టు

ప్రిన్సిపాల్ క్వార్టర్స్‌లో 1,700 కిలోల బియ్యం నిల్వలు

ఎంపీపీ తనిఖీలో వెలుగు చూసిన వైనం



అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి



తుప్పల్లో దాచి వుంచిన బియ్యం బస్తాలు

రాజవొమ్మంగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యాభ్యాసానికి వచ్చిన విద్యార్థినులను కార్మికులుగా మార్చడమే కాకుండా ఏకంగా దొంగలను చేసింది ఓ ప్రిన్సిపాల్. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి ప్రభుత్వ బాలికల గురుకుల కళాశాలలో వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి... ఎంపీపీ గోము వెంకటలక్ష్మి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి అన్ని సౌకర్యాలు ఉన్నాయా అని విద్యార్థులను ఆరా తీశారు. ఆ సమయంలో మెస్ పక్కనే ఉన్న ప్రిన్సిపాల్ క్వార్టర్‌లో ఇంగ్లీష్ లెక్చరర్ ఉంటున్నారని, అక్కడ వేల కిలోల బియ్యం అక్రమంగా నిల్వ చేసి ఉంచినట్టు ఆమె తెలుసుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులకు, పాత్రికేయులకు సమాచారం అందించారు. హుటాహుటిన కళాశాలకు వచ్చిన రెవెన్యూ అధికారులు క్వార్టర్ తాళం లేకపోవడంతో కళాశాలలో ఉండాల్సిన స్టాక్, ఉన్న స్టాక్ వివరాలను చూశారు. బియ్యం నిల్వ చేసిన క్వార్టర్ వెనుక వైపు నుంచి వచ్చిన ప్రిన్సిపాల్ బస్తాలను తుప్పల్లోకి మోయలంటూ విద్యార్థినులను ఆదేశించారు. దీంతో వారు బియ్యం బస్తాలను సుమారు 100మీటర్ల దూరంలో ఉన్న తుప్పల్లోకి తీసుకెళ్లారు. దీనిని గమనించిన ఎంపీపీ వెంకటలక్ష్మి క్వార్టర్ వెనుక వైపునకు వెళ్లడంతో నాలుగు బస్తాలను తుప్పల్లో వదిలి 8 మంది విద్యార్థినులు పరుగులు తీశారు. ప్రిన్సిపాల్ సలోని తీరుపై ఎంపీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ఐటీడీఏ పీవోకు, కలెక్టర్‌కు జరిగిన ఘటనను ఫోనులో నివేదించింది. వెంటనే స్పందించిన పీవో డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతిని విచారణ అధికారిగా నియమించారు. ఉదయం 11 గంటల నుంచీ బియ్యం నిల్వ చేసిన క్వార్టర్ తాళాలను ప్రిన్సిపాల్ ఇవ్వకపోవడంతో రెవెన్యూ అధికారులు ఆ గదిని సీజ్ చేశారు. సాయంత్రం డీడీ విజయశాంతి వచ్చే వరకు రెవెన్యూ సిబ్బంది, ఎంపీపీ అక్కడే నిరీక్షించారు. విజయలక్ష్మి వచ్చి మండల అధికారుల సమక్షంలో క్వార్టర్ తెరిచి దర్యాప్తు నిర్వహించారు. అనంతరం డీడీ విజయశాంతి పాత్రికేయులతో మాట్లాడుతూ... క్వార్టర్‌లో 34 బస్తాల్లో 1,700 కిలోల బియ్యం, 10 కిలోల చింతపండు నిల్వ వుంచినట్టు గుర్తించి వాటిని అడ్డతీగల ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని, దీనికి పూర్తి బాధ్యత తనదే అని ప్రిన్సిపాల్ సలోని ఒప్పుకున్నారని చెప్పారు.

దర్యాప్తులో భాగంగా కళాశాల విద్యార్థినులను డీడీ ప్రశ్నించగా స్టాక్ పాయింట్ నుంచి 34 బస్తాలను దసరా సెలవులకు ముందు తామే ప్రిన్సిపాల్ క్వార్టర్‌లోకి మోసామన్నారు. గురువారం అధికారుల తనిఖీల సమయంలో కూడా ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకే బియ్యం బస్తాలను క్వార్టర్ వెనుక నుంచి తుప్పల్లోకి తీసుకెళ్లామన్నారు. విద్యార్థినులతో బియ్యం బస్తాలు మోయించడంపై ఎంపీపీ గోము వెంకటలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీడీ విజయశాంతి మాట్లాడుతూ ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానని, ప్రిన్సిపాల్‌పై త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు.

ఏవీ నగరంలో అర్ధరాత్రి అలజడి

- మహిళ ఇంటికి వచ్చిన యువకుడు
- ఇటీవల మహిళ భర్త మృతి
- వారిద్దరే హత్య చేశారని బంధువుల ఆరోపణ
- పోస్టుమార్టానికి సిద్ధమవుతున్న అధికారులు

తొండంగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరంలో గురువారం అర్ధరాత్రి వేళ ఒక యువకుడు ఒక మహిళ ఇంటికి రావడంతో గ్రామంలో అలజడి చెలరేగింది. మహిళతో పాటు యువకుడిని గ్రామస్తులు నిలువరించారు. అర్ధరాత్రి వేళ యువకుడు రావడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసి ఆరా తీశారు. యువకుడి పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏవీ నగరం దళిత కాలనీకి చెందిన బత్తిన మధుబాబు (38) ఈ నెల 18న మృతి చెందాడు. ఆయన భార్య శిరీష, శంఖవరం మండలం శృంగవరం గ్రామానికి చెందిన పీతల ప్రశాంత్‌కుమార్ గతంలో ఒక ఆసుపత్రిలో పని చేశారు. శిరీష ఇంటికి ప్రశాంత్‌కుమార్ అర్ధరాత్రి గుట్టు చప్పుడు కాకుండా రావడాన్ని గమనించిన స్థానికులు, బంధువులు ఈ వేళ రావాల్సిన అవసరమేముందని వారిని నిలదీశారు. అంతేగాక మధుబాబు మృతికి వారిద్దరే కారణమని బంధువులు అనుమానిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తొండంగి పోలీసులకు తెలిపి మధుబాబుది సహజ మరణం కాదన్న అనుమానం వ్యక్తం చేశారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ మధుబాబు మృతిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పూడ్చిపెట్టిన మధుబాబు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

లారీని ఢీకొన్న వ్యాన్

తీవ్ర గాయాలతో డ్రైవర్ మృతి



మృతుడు గురునాయుడు (పాత చిత్రం)

తుని రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం చేపూరు సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. విజయవాడ నుంచి విజయనగరం కోడిగుడ్లతో వెళ్తున్న వ్యాన్ గవరయ్య కోనేరు వద్దకు చేరుకునే సమయంలో ఎదరు చక్రం పాడవ్వడంతో ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. క్యాబిన్‌లో చిక్కుకోగా తీవ్ర గాయాలతో మృతి చెందాడు. తుని రూరల్ పోలీసులుసంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు వెల్లడించారు. మృతి చెందిన డ్రైవర్ కల్యాణపు గురునాయుడు (30) విజయనగరం జిల్లా గొర్ల గ్రామానికి చెందిన వాడని, అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.

పూడ్చి పెట్టిన మృతదేహానికి శవపంచనామా



గోదావరి తీరంలో పూడ్చిపెట్టిన బాలిక మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిర్వహిస్తున్న దృశ్యం

ఆలమూరు, అక్టోబరు 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడుకు చెందిన చెక్కపల్లి వెన్నెల (15) ఈ నెల 18న ఆత్మహత్యకు పాల్పడింది. గోదావరి తీరంలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని గురువారం వెలికితీశారు. ఆలమూరు తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు అధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులు, బంధువుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ నెల 18న వెన్నెల ఇంటి వద్ద ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆ రోజే మడికి వద్ద గోదావరిలో పూడ్చి పెట్టారు. తన కుమార్తె చెముడులంకలోని షిర్డిసాయి విద్యానికేతన్‌లో పదో తరగతి చదువుతోందని, దసరా సెలవులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో స్కూలు యాజమాన్యం బెదిరించిందని, దీంతో పదో తరగతి పాస్ కాలేననే ఉద్దేశ్యంతో ఆత్మహత్యకు పాల్పడిందని వెన్నెల తండ్రి చెక్కపల్లి శ్రీనివాస్ ఈ నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస్‌కు మద్దతుగా వెన్నెల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ బుధవారం రాత్రి భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వెన్నెల కుటుంబానికి న్యాయం చేయాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. కాగా ఫిర్యాదు నేపథ్యంలో ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆలమూరు ఇన్‌చార్జి ఎస్ఐ ఎస్.రాము, ఏఎస్ఐ సూర్యచంద్రరావుతో పాటు పలువురు ఇబ్బంది సమక్షంలో శవపరీక్షకు ఏర్పాట్లు చేశారు. పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తహసీల్దారు ప్రకాష్‌బాబు సమక్షంలో బయటకు తీసి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.



నిందితులతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్న మోతుగూడెం ఎస్ఐ

గంజాయి అక్రమ రవాణా ముఠా అరెస్టు

మోతుగూడెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం ఎస్ఐ కె.శివనారాయణకు వచ్చిన సమాచారంతో మోతుగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రంలోని పసుపుల్లంక గ్రామం నుంచి విజయవాడకు అక్రమంగా తరలిస్తున్న రూ.10వేలు విలువైన రెండు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. షేక్ రిజ్వాన్, కూరగంటి సుభాష్‌లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. తనిఖీల్లో ఏఎస్ఐ రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, వీసీఎస్ ఈశ్వరరావు, ఎస్ఆర్‌కే రాజు, ఏఆర్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమోన్మాదం

- వివాహితపై యువకుడి హత్యాయత్నం
- తిరుగుడుమెట్టలో ఘటన
- వివరాలు సేకరించిన తాళ్లపూడి పోలీసులు

తాళ్లపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను ఒప్పుకోలేదని ఒక ఉన్మాది వివాహితపై హత్యాయత్నానికి తెగబడ్డాడు. ఏలూరు జిల్లా దెందులూరు గ్రామానికి చెందిన ఆరేపల్లి హరినాథ్ డిగ్రీ చదివి ఖాళీగా ఉంటున్నాడు. ఇదిలా ఉండగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం గ్రామానికి చెందిన యువతి అమ్మమ్మ ఊరైన దెందులూరు వెళ్లింది. ఆ యువతిని చూసిన హరినాథ్ ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. అందుకు ఆమె ససేమిరా అంది. తమ బంధువుల అబ్బాయితో పెళ్లి కుదిరింది వదిలేయమని వేడుకుంది.. అయినా పట్టించుకోకుండా వెంటపడుతూనే ఉండేవాడు. ఇదిలా ఉండగా ఆరు నెలల కిందట తూర్పు గోదావరి జిల్లా తిరుగుడుమెట్టకు చెందిన బంధువుల అబ్బాయితో వివాహమైంది. అయినా ఆమెను వదల్లేదు. ఫోన్ చేసి వేదిస్తూనే ఉన్నాడు. ఆమె స్పందించకపోవడంతో ఉన్మాదిగా మారి గురువారం ఉదయం తిరుగుడుమెట్ట చేరుకున్నాడు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుందాం రమ్మని పట్టుబట్టాడు.. అయినా మాట వినలేదు.. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. స్థానికులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుండగానే తన వెంట తెచ్చుకున్న చాకుతో ఆమె పొట్ట భాగంలో పొడిచి పారిపోయాడు. గాయాలపాలైన మహిళను స్థానికులు వెంటనే కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి బాగానే ఉన్నట్టు తెలిసింది. ఈ ఘటనపై తాళ్లపూడి పోలీసులు బాధితురాలి నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉన్మాది పరారీలో ఉన్నట్టు పోలీసులు చెప్పారు.



అత్యాచారయత్నం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ భీమరాజు, శివకృష్ణ

వృద్ధురాలిపై అత్యాచారయత్నం

కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు

క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

పి.గన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో బాధపడుతూ కొన్నాళ్లగా మంచంపైనే ఉన్న వృద్ధురాలిపై కనికరం లేకుండా అత్యాచార యత్నం చేశాడు ఓ ఉన్మాది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని ఒక గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఐ.పోలవరం మండలం జి.మూలపొలానికి చెందిన ఓ వృద్ధురాలు రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడుతోంది. నాలుగు నెలల క్రితం పి.గన్నవరం మండలంలోని కుమార్తె ఇంటికి వచ్చింది. కుమార్తె ఈ నెల 23వ తేదీన ఒక కార్యక్రమానికి వెళ్లింది. సాయంత్రం 4.30 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చింది. ఒక వ్యక్తి తనపై అత్యాచారయత్నం చేశాడని వృద్ధురాలు కుమార్తెకు తెలిపింది. అదే గ్రామానికి చెందిన లంకె సత్యనారాయణ ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చని భావిస్తూ కుమార్తె పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు అదే రోజు రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. గురువారం సీఐ భీమరాజు క్లూస్‌టీమ్ ఎస్ఐ ప్రవీణ్‌తో పాటు సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పూరిల్లు దగ్ధం

పెద్దాపురం అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తారా జువ్వపడి పూరిల్లు దగ్ధమైన సంఘటన స్థానిక పాతపెద్దాపురంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పి.రాజామణికి చెందిన తాటాకిల్లుపై తారా జువ్వ పడి ఇల్లు పాక్షికంగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.80వేల ఆస్తినష్టం సంభవించినట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో ముద్దలుగా అన్నం

● రంగునీళ్లలాంటి సాంబారు ●తినలేక ఇబ్బందులు పడుతున్న చిన్నారులు



ఉడికీ ఉడకని ముద్దలుగా ఉన్న అన్నం

కొత్తపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజనం పథకంలో నాణ్యమైన, పోషకాలతో కూడిన రుచికరమైన భోజనం సరఫరా చేయాలన్నది కూటమి ప్రభుత్వ ఆశయం. కొత్తపల్లి మండలం కుతుకుడుమిల్లి ప్రాథమిక పాఠశాలకు గురువారం సరఫరా చేసిన భోజనం ప్రభుత్వ ఆశయానికి భిన్నంగా ఉంది. ఉడికీ ఉడకని ఉండలు కట్టిన అన్నం, రంగు నీళ్ల లాంటి సాంబారుతో విద్యార్థులు తినలేక నానా అవస్థలు పడ్డారు. అన్నం తినకపోతే మాస్టార్లు ఏమైనా అంటారేమో అనుకొని నీళ్లలా ఉన్న సాంబారుతో ఉండలుగా ఉన్న అన్నం తినలేక ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. ప్రతీరోజూ ఇలానే ఉంటుందని, తాము ఒకరోజు పాఠశాలలో భోజనం చేస్తూ ఇంటికి వెళ్లిపోతామని చిన్నారులు చెప్పడం గమనార్హం. ఇక్కడ విద్యా ర్థులకు చదువు చెప్పే ఉపాధ్యాయులు స్కూల్ సరఫరా చేసే మధ్యాహ్న భోజనం రుచులను పరిశీలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. పాఠశాలలో ఉడికీ ఉడకని అన్నం తిన్న తమ పిల్లలు ఇంటికి వచ్చి కడుపు నొప్పి వస్తుందని ఇబ్బందులు పడుతున్నారని తల్లులు ఆరోపించారు. నాణ్యమైన రుచికరమైన భోజనాలను పాఠశాలలకు సరఫరా చేయాలని తల్లిదండ్రులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.



కుతుకుడుమిల్లి ప్రాథమిక పాఠశాలకు మధ్యాహ్న భోజనంలో సరఫరా చేసిన రంగునీళ్ల సాంబారు

ఉద్యాన పరిశోధనా కేంద్రం సేవలను వినియోగించుకోవాలి

పెద్దాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఉద్యాన పరిశోధనా స్థానం సేవలను వినియోగించు కోవాలని శాస్త్రవేత్తలు డాక్టర్ సునీత, డాక్టర్ జానకి అన్నారు. స్థానిక ఉద్యాన పరిశోధనా కేంద్రంలో షెడ్యూల్ క్యాస్ట్ సబ్‌ప్లాన్ (ఎస్సీఎస్‌పీ)లో భాగంగా మల్లవరానికి చెందిన దుంప రైతులకు స్ప్రెయర్లు అందజేశారు. దుంప తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, చీడ పీడల యాజమాన్యం, సాగుచేసే విధానం తది తర విషయాలపై అవగాహన కల్పించారు.

టిడ్కో చైర్మన్ వేములపాటికి మల్లాడి సత్కారం



టిడ్కో చైర్మన్ వేములపాటిని సత్కరిస్తున్న రాజేంద్రప్రసాద్

కాకినాడ సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టిడ్కో కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన వేములపాటి అజయ్‌కుమార్‌ను కాకినాడకు చెందిన జనసేన నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో జరిగిన టిడ్కో చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో చైర్మన్ అజయ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు.

పట్టభద్రుల ఓటును నమోదుచేసుకోవాలి

కరప, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూ ర్పు-పశ్చిమగోదావరిజిల్లాలపట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు ను ప్రతిఒక్కరూ నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ సీపీఎస్ జిల్లా కన్వీనర్ వాకాడ వెంకటరమణ(చిన్ని మాస్టారు) సూచించారు. కరపలో గురువా రం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న ప్రాధాన్యంను గుర్తెరిగి అర్హత ఉన్న గ్రాడ్యుయేట్లు అందరూ తమ ఓటు హక్కును పొందాలన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు నవంబరు 6వ తేదీలోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ఓటు నమోదుచేసుకోవాలన్నారు. అనంతరం ఓటు నమోదుకు సం బంధించిన దస్త్రాలను గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు బొజ్జ మంగారావు, కార్యదర్శి పాట్నీడి నాగేశ్వరరావు, డీవీవీ బాపిరాజు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి

తాళ్లరేవు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బలోపేతానికి గ్రామాల్లో కార్యకర్తలంతా కృషిచేయాలని టీడీపీ సీనియర్ నేత టేకుమూడి లక్ష్మణరావు అన్నారు. గురువారం మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసమావేశంలో టీడీపీ నేతలు పొన్నమండ రామలక్ష్మి, వుంగరాల వెంకటేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, మోపూరి వెంకటేశ్వరరావు, గంజా సూరిబాబు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగినుల భద్రతకు ప్రాధాన్యం

● ఏపీ జేఏసీ అమరావతి జిల్లాశాఖ అధ్యక్షుడు త్రినాథ్

కాకినాడసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగినుల భద్రతకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్య మిస్తోందని ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లాశాఖ అధ్యక్షుడు పితాని త్రినాథ్ అన్నారు. ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లా మహిళా విభాగం సర్వ సభ్య సమావేశం గురువారం సాయంత్రం కలెక్టరేట్ ఎదురుగా గల రెవెన్యూ భవన్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పారే లక్ష్మి, కార్యదర్శి సునీత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా మహిళా విభాగం డివిజనల్ యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. డివిజనల్ యూనిట్ కార్యవర్గ సభ్యురాళ్లుగా నాగవేణి, రమాదేవి, జానకి, లక్ష్మి, రామశ్రీలక్ష్మి, శ్రీదేవి, సౌమ్య, ప్రత్యూష, కౌసల్య, సంధ్య, ఇంద్రాణి, గిరిజ, ప్రజ్ఞ, వెంకటలక్ష్మి, మాణిక్యం, అనురాధ, సౌమ్య ఎన్నికయ్యారు. సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖలనుంచి పెద్దసంఖ్యలో ఉద్యోగినులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న త్రినాథ్

కలెక్టర్‌ను కలిసిన కార్యవర్గ సభ్యులు

కార్యవర్గ సభ్యురాళ్లు కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మహిళా ఉద్యోగినుల భద్రతకు షీబాక్స్ ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఈ ప్రతిపాదన ఇదివరకే తనవద్ద ఉందని, త్వరలోనే అమలు చేయగలనని అన్నారు. కలెక్టర్ హామీపై ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లా శాఖ కృతజ్ఞతలు తెలిపింది.

ఆకట్టుకున్న గణిత అష్టావధానం

కాకినాడ సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సాహిత్యానికి పరిమితమై అవధాన ప్రక్రియను గణితానికి అన్వయించి ప్రముఖ గణిత అవధాని, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ చేసిన గణితావధానం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. కాకినాడ ఏఎస్‌డీ ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం కార్యక్రమం జరిగింది. వార గణనలో 1998, ఆగస్టు 28 ఏరోజు అని సభికులు అడిగిన ప్రశ్నకు సెకన్ల వ్యవధిలో శుక్రవారం అని సాయరామకృష్ణ సమాధానం అబ్బురపరిచారు. సమస్యా పూరణంలో ఎటు కూడినా 76 రావాలని కోరగా 28 రకాలుగా 76 వచ్చేలా పూరించి ఆకట్టుకున్నారు. దత్తంకం, నిషిద్ధాంకం, మనఃసంకల్పం, వర్గాల భేదం, అప్రస్తుత ప్రసంగం తదితర 8అంశాల్లో ప్రుచ్ఛకులు అద్యంతం ఆసక్తికరంగా సాగేలా అవధానంలో పాల్గొన్నారు. ఈ వినూత్న ప్రక్రియలో ప్రుచ్ఛకులుగా పీఆర్ కళాశాల విద్యార్థులు, ఏఎస్‌డీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల ఆధ్వర్యంలో సాయి రామకృష్ణను శాలువాతో సత్కరించారు. ప్రిన్సిపాల్ అనంత లక్ష్మి, నాక్ కోఆర్డినేటర్ వసంతలక్ష్మి పాల్గొన్నారు.



అష్టావధానంలో పాల్గొన్న విద్యార్థులు

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కరప, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కరపమండలం నడకుదురు శివారు పొలాల్లో పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడిచేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.30,300ల నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు కరప ఎస్‌ఐ తోట సునీత తెలిపారు. నిందితులపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తామని ఆమె చెప్పారు.

జిల్లా టెలికం సలహాసంఘ సభ్యుడిగా దుర్గా ప్రసాద్



కొత్తపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా బీఎస్ఎన్ఎల్ టెలికం సలహా సంఘ సభ్యుడిగా ఉప్పాడకు చెందిన జనసేన నాయకుడు దొడ్డి దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. తనను టెలికం సలహాసంఘ సభ్యుడిగా నియామకానికి కృషి చేసిన కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్‌కు దుర్గాప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రసాద్ టెలికం సలహాసంఘసభ్యుని నియామకం పట్ల పలువురు జనసైనికులు అభినందనలు తెలియజేశారు.

హెవీ డ్రైవింగ్ శిక్షణ డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందజేత

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపోలో హెవీ డ్రైవింగ్ శిక్షణ తరగతుల 18వ బ్యాచ్ ముగింపు సందర్భంగా శిక్షణ తీసుకున్న డ్రైవర్లకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. కాకినాడ డీఎం మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు విచ్చేసి శిక్షణ తీసుకున్న డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఆపాలని వినతి

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లపై వేధింపులు ఆపాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఆధ్వర్యంలో కలెక్టర్ షాన్‌మోహన్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వాలు మారినప్పుడు ప్రతిసారీ ఫీల్డ్ అసిస్టెంట్లను వేధించడం తగదన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చేసిన ఆరోపణలపై విచారణ

తాళ్లరేవు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చొల్లంగిపేట ఫీల్డు అసిస్టెంట్ కారే జ్యోతిపై అధికారులకు స్థానికులు చేసిన ఫిర్యాదుపై ఏపీడీ వసంత మాధవి గురువారం పంచాయతీ కార్యాలయంవద్ద విచారణ చేపట్టారు. తప్పుడు మస్తర్లు వేసి డబ్బులు వసూల్లు చేస్తున్నారని, మరుగుదొడ్లు, గృహనిర్మాణల లబ్ధిదారుల నుంచి 18,500 రికవరీ చేసి ప్రభుత్వానికి చెల్లించలేదని, పనికావాల్సిన వారికి పనిచెప్పడంలేదని, కూలీల పట్ల చాలా నిర్లక్ష్యంగా అమర్యాదగా వ్యవహరిస్తున్నారని సంజాయిషీ చెప్పాలని ఫీల్డు అసిస్టెంట్ జ్యోతిని ఏపీడీ వసంతమాధవి ఆదేశించారు. విచారణ నివేదికను పీడీకు అందజేయనున్నట్లు ఏపీడీ తెలిపారు. ఈవిచారణలో సర్పంచ్ కందెల్ల గంగాభవాని, ఎపీవో తేజస్విని, కార్యదర్శి సాంబయ్య, ఉపసర్పంచ్ శెట్టి శ్రీనివాసు, గ్రామకమిటీ అధ్యక్షుడు నరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై రైతుల్లో అవగాహన పెంపొందించాలి

సామర్లకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలలో నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామ సభలపట్ల రైతులకు అవగాహన పెంపొందించడం ద్వారా గ్రామ సభలను విజయవంతం చేసేందుకు వీఆర్వోలు కృషిచేయాలని సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. సామర్లకోట తహశీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం మండలంలోని అన్ని గ్రామాల వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమీక్షలో తహశీల్దార్ చంద్రశేఖరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామం నుంచీ భూ సంబంధిత సమస్య లేకుండా సరిచూసే బాధ్యత ప్రతీ వీఆర్వోపై ఉందన్నారు. దీపావళి సందర్భంగా సామర్లకోట పట్టణంలోనూ, మండలంలోని వేట్లపాలెం, పెదబ్రహ్మదేవం తదితర గ్రామా లలో ఏర్పాటుచేసే బాణాసంచా విక్రయ దుకాణదారులు భద్రతా నిభంధనలు అమలు చేయించే బాధ్యత ప్రతీ వీఆర్వోలపై ఉందని తహశీల్దార్ చంద్రశేఖరెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో వీఆర్వోలు కెవీవీ. సత్యనారాయణ, ఖాదర్ వల్లీ, జయమ్మ, నూతలపాటి లోవరాజు, పృథ్వీ, రాంజీ, కామరాజు పాల్గొన్నారు.



వాకాడలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

చొల్లంగిపేటలో రెవెన్యూ గ్రామసభ

తాళ్లరేవు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చొల్లంగిపేట గ్రామపంచాయతీలో రెవెన్యూ గ్రామసభను సర్పంచ్ కందెల్ల గంగాభవాని అధ్యక్షతన గురువారం నిర్వహించారు. రీ సర్వేలో జరిగిన అభ్యంతరాలు, సవరణలు భూసమస్యలపై 15మంది రైతుల నుంచి అధికారులు వినతులను స్వీకరించారు. ఈగ్రామసభలో తహసీల్దార్ పి.త్రినాధరావు, డీటీ సూరిబాబు, వీఆర్వో కాశీ రత్నం, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే ధ్యేయం

కరప, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారమే ధ్యేయంగా రీ సర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కె.అప్పారావు తెలిపారు. వాకాడలో గురువారం నిర్వహించిన రీసర్వే గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. ఈ గ్రామసభలో 95మంది రైతులు తమ సమస్యల పరిష్కారంకోరుతూ దరఖాస్తులందజేశారు. మండల సర్వేయర్ ఎస్.రూపవతి, మాజీ సర్పంచ్ పెంకే సోమరాజు, మాజీ ఉపసర్పంచ్ దూడల నారాయుడుఉ, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ డి.దుర్గాప్రసాద్, వీఆర్వో శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యం నిమిత్తం రూ.70వేల ఆర్థిక సాయం



చిన్నారి వైద్యం నిమిత్తం నగదు అందజేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల వ్యాధితో తీవ్ర ఇబ్బంది పడుతున్న అడ్డతీగల ప్రాంతానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి హేమ నవిత వైద్యం నిమిత్తం దాతల సహకారంతో శ్రీ యువసేన ద్వారా రూ.70వేలు ఆర్థికసాయం అందించారు. వైజాగ్ రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పటల్‌లో చిన్నారి చికిత్స పొందు తోంది. ఈమేరకు పాప తండ్రి వెంకటరమణకు శ్రీ యువసేన అధినేత బొల్లం సతీష్ నగదును అందజేశారు. 20రోజుల క్రితం ఇదే వ్యాధితో పాపతల్లి దేవి కాకినాడలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

ప్రజలకు సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలి

● మండల సమావేశంలో ఎమ్మెల్యే నానాజీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బురద, కలుషితంగా తాగునీరు సరఫరా అవుతోందని ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని, సురక్షిత తాగునీటి సరఫరాకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తగినచర్యలు తీసుకోవాలని కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశించారు. గురువారం రమణయ్యపేట మండల కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీ బి.వీరీష అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి, పురోగతి పనులపై సమీక్ష నిర్వహించిన అనంతరం సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్నికలు వరకే రాజకీయాలని, తర్వా త పార్టీల కతీతంగా గ్రామాభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఓవర్ హెడ్ ట్యాంకులన్నీ శుభ్రం చేసినా తాగునీటి సరఫరా మెరుగుపడకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించి సురక్షిత తాగునీరందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎరువుల కొరత ఉన్నట్లు రైతులు చెప్పారని ఈ విషయమై వివరణ ఇవ్వాలని వ్యవసాయాధికారి సత్యనారాయణను ఆదే శించారు. గొడౌన్లు ఉన్నచోట స్టాకు ఉందని, లేనిచోట ముందస్తుగా స్టాకు నిల్వ చేసుకునేందుకు అవకాశం లేదని ఎమ్మె ల్యేకు తెలియజేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా రీ సర్వే గ్రామసభలు నిర్వహించడంపైతహశీల్దార్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఫోన్ చేస్తే ఆర్డీవో, తహశీల్దార్లు అందుబాటులో లేకుండా బిజీగా ఉంటున్నారని ఫోన్ చేసినప్పుడు సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గోదావరి కాలువ గట్టుని సిటీ మాజీ ఎమ్మెల్యే ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాన్ని తొలగించాలని పలువురు నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, దీని తొలగింపుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నేమాం, తిమ్మాపురం సర్పంచ్‌లు రాందేవు చిన్న, బెజవాడ సత్యనారాయణలు గ్రామ సమస్యలపై ప్రస్తావించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీడీవో పసుపులేటి సతీష్, తహశీల్దార్ కుమారి, ఈవోపీఆర్‌డీ ఎంఎస్‌ఆర్ రామాంజనేయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గాంధీ బొమ్మ సెంటర్‌లో
మద్యం దుకాణం ఏర్పాటుపై నిరసనలు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేట్‌గా మద్యం దుకాణాలను లాటరీ ద్వారా వ్యాపారులకు కేటాయించింది. లాటరీలో షాపులు దక్కించుకున్న వ్యాపారులకు షాపులు దొరికిన వారు మద్యం దుకాణాలు ఏర్పాటు చేయ డం, అమ్మకాలు చేయడం ప్రారంభించారు. ముఖ్యమైన సెంటర్లలో మద్యం అమ్మకాలకు సరైన దుకాణాలు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. కాకినాడ గాంధీ నగర్‌లో గాంధీబొమ్మ సెంటర్‌లో గాంధీజీ విగ్రహం సమీపంలోనే మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సర్వత్రా విమర్శలకు దారితీసింది. ఈ సెంటర్ సమీపంలో చర్చి, ప్రైవేట్ ఆసుపత్రి, గాంధీనగర్ పార్కుకెళ్లే వారితో నిత్యం బీజీగా ఉంటుంది. ముఖ్యంగా గాంధీజీ విచ్చేసిన పార్కుకు సమీపంలో, గాంధీబొమ్మ సెంటర్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం దారుణమని, ఎక్సైజ్ అధికారులు ఈ విషయమై విచారణ నిర్వహించి మద్యం దుకాణం ఇక్కడ ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గాంధీ బొమ్మ సెంటర్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేసిన దృశ్యం

స్పీడ్ స్కేటింగ్‌లో వీరవర్షిణికి బంగారు పతకం

కాకినాడరూరల్, అక్టోబరు 24: కాకినాడలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్‌ఫెడరేషన్ పోటీలలో స్పీడ్ స్కేటింగ్ విభాగంలో వడిగల వీరవర్షిణి ప్రథమస్థానంలో నిలిచి బంగారుపతకం సాధించినట్లు శ్రీచైతన్య ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎం.హరిప్రసాద్ తెలిపారు. ప్రతిభ కనబరచి బంగారుపతకం సాధించిన వీరవర్షిణిని ఏజీఎం రాంబాబు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.



వీరవర్షిణిని అభినందిస్తున్న శ్రీచైతన్య ఏజీఎం హరిప్రసాద్

ఘనంగా ఐక్యరాజ్యసమితి వ్యవస్థాపక దినోత్సవం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో గురువారం డిపార్టుమెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ స్టీఫెన్ ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి 79వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.కమలాకుమారి మాట్లాడుతూ ప్రపంచ శాంతి స్థాపనలో ఐక్యరాజ్యసమితి చేసిన కృషి ఎనలేనిదన్నారు. అంతర్జాతీయంగా దేశా ల మధ్య మనదేశం చేసిన కృషిని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం నానిబా బు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ గోపి, డాక్టర్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు ప్రారంభం

తాళ్లరేవు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రయాణం త్వరగా గమ్యం చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం రోడ్డురవాణా సంస్థ ద్వారా ప్రజలకు బస్సుల సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని ఎంపీ గంటి హరీష్‌మాదుర్ అన్నారు. గురువారం తాళ్లరేవువాసులు వుల్లింగి విజయబాబు, జార్జిలు కొత్తగా కొనుగోలుచేసిన ఆర్‌టీసీ బస్సులు నాలుగు తుని ఆర్‌టీసీ డిపోకు లీజుకు ఇచ్చిన బస్సులను ఎంపీ హరీష్ మాదుర్ ప్రారంభించారు.

ఏడీబీ రహదారిలో ఆటోలు ఢీ

● ఇద్దరికి తీవ్రగాయాలు

పెద్దాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏడీబీ రహదారిలో ఆగి ఉన్న రెండు ప్యాసింజర్ ఆటోలను ఓలోడ్ ఆటో ఢీకొట్టిన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరం వైపునకు వెళుతున్న లోడ్ ఆటో స్థానిక కనకదుర్గ ఆలయం సమీపంలో ఆగి ఉన్న ఆటోలను ఢీ కొట్టింది. దీంతో ఆటోలు ఒకదానికొకటి ఢీ కొట్టుకున్నా యి. దీంతో మూడు ఆటోలు అదుపుతప్పాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక తర లించారు. ఎస్‌ఐ వి.మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఏడీబీ రహదారిలో ప్రమాదానికి గురైన ఆటోలు

పారదర్శకంగా పశుగణన చేపట్టాలి

● పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్‌బాబు

కరప, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగనుందని, ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలని పశుసంవర్ధకశాఖ కరప సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్‌జేఎస్ సురేష్ బాబు తెలిపారు. కరప ప్రాంతీయ పశువైద్యశాలలో గురువారం పశుసంవర్ధకశాఖ సిబ్బందికి ఏర్పాటుచేసిన సమావేశంలో పశుగణనలో పాటించాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కాకినాడరూరల్ నియోజకవర్గంలో గేదెలు, ఆవులు, మేకలు, కోళ్లు, పశుసంబంధిత పనిముట్లు ఎన్యుమరేషన్ కార్యక్ర మం పక్కాగా చేపట్టడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కరప మండలంలో 16మంది ఎన్యుమరేటర్లు, నలుగురు సూపర్‌వైజర్లు, కాకినాడరూరల్ మండలంలో 15మంది ఎన్యుమరేటర్లు, ఇద్దరు సూపర్‌వైజర్లు ఈ పశుగణన కార్యక్రమాన్ని చేపడతారన్నారు. బడ్జెట్ కేటాయింపు, పథ కాలు, ప్రణాళికల రూపకల్పనలో ఈ పశుగణన కీలకమవుతోందని ఆయన చెప్పారు. అనంతరం కరప, నడకుదురు పశువైద్యశాలల్లో సిబ్బందికి ఐడెంటిటీ కార్డులు, బ్యాగ్‌లు, స్టిక్కర్లను అందజేశారు. నడకుదురు, వేళంగి వెటర్నరీ అసిస్టెంట్లు డాక్టర్ ఎం.రవికిరణ్, డాక్టర్ కె.అనిల్, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి మెటీరియల్ అందిస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్‌బాబు

నిబంధనలు పాటించకుంటే చర్యలు

పిఠాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బాణాసంచా దుకాణాలవద్ద నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని పిఠాపురం తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ స్పష్టం చేశారు. పిఠాపురం తహసీల్దారు కార్యాలయంలో గురువారం బాణాసంచా దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. దుకాణాల నిర్వహణకు పట్టణ శివారులోని ఆరుద్ర లేఅవుట్ ప్రాంతాన్ని ఎంపికచేసినట్లు తెలిపారు. దుకాణాల ఏర్పాటుకు 18 దరఖాస్తులు అందాయని చెప్పారు. మూడురోజులు ముం దు నుంచి విక్రయాలు చేసుకోవచ్చునని తెలిపారు. దుకాణాల మధ్య దూరం ఉండాలని, నీరు, ఇసుక ఉంచాలని సూచించారు. చిన్నపిల్లలను దుకాణాల్లో ఉంచవద్దని చెప్పారు. అగ్నిప్రమాదాలకు ఆస్కారం ఇవ్వకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో ఆర్‌ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుకను త్వరితగతిన అందుబాటులోకి తేవాలి

గొల్లప్రోలురూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుకను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికులు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంవద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఉచిత ఇసుకను అందిస్తున్నామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించినప్పటికీ నేటికీ ఇసుక సరఫరా కావడం లేదని వారు తెలిపారు. ఎన్నికల ముందు చెప్పిన విధంగా భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, పెండిగ్ క్లెయిమ్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు కుంచే చిన్నా, కరణం విశ్వనాథం, డి.సత్యనారాయణ, పి.రమణ, సీహెచ్ సాంబశివ, రమణ, నందీశ్వరరావు, వీరబాబు, సత్తిబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరదగట్ల పనుల పరిశీలన

కిర్లంపూడి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెంలో బెడ్ రెగ్యులేటర్ వద్ద జరుగుతున్న వరద గట్ల పనులను గురువారం క్వాలిటీ కంట్రోల్ అధికారి అజహర్ అలీ పరిశీలించారు. పనులు పరిశీలనకు వచ్చామని తెలిపారు. కిర్లంపూడి ఇరిగేషన్ ఇన్‌చార్జి జేఈ శేషగిరితో కలిసి పరిశీలించారు. త్వరలో మిగతా గట్లు పటిష్ఠ పరుస్తామన్నారు. టీడీపీ నాయకులు ఈశ్వరరావు, దొరబాబు ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం, మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మంత్రికి సమస్యలతో కూడిన వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

విలీన మండలాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి

పరిష్కారానికి సత్వర చర్యలు: మంత్రి సంధ్యారాణి

ఎటపాక, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విలీన మండలాల సమస్యలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. అమరావతి సచివాలయం నుంచి మంత్రి ద్వారా పిలుపురావడంతో అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్పా శ్రీనివాస్ బృంద సభ్యులు, టీడీపీ నాయకులు గురువారం అమరావతి తరలివెళ్లారు. ప్రధాన సమస్యలను మంత్రికి విన్నవించారు. విలీన మండలాలకు ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని, ఎటపాకకు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల మంజూరు చేయాలని, పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎటపాక నుంచి తూరుబాక వరకు రహదారి అధ్వానంగా ఉందని, మరమ్మతులు చేయాలని కోరారు. పోలవరం ఆర్ అండ్‌ఆర్ పరిహారం విషయంలో గందరగోళం ఏర్పడిందని, ముంపు గ్రామాలను గుర్తించి ప్యాకేజీ పరిహారం ఇచ్చి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. గోదావరి వరద ప్రమాదం లేకుండా ఎటపాక నుంచి కన్నాయిగూడెం వరకు కరకట్టను పటిష్ఠం చేయాలని కోరారు. వీటి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు శ్రీనివాస్ చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు గొడేటి రవికుమార్, ముప్పా రాము, ఉయికే ముత్తయ్య, పి.రాంబాబు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును పకడ్బందీగా చేపట్టాలి: ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును పకడ్బందీగా చేపట్టాలని నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సూచించారు. శుక్రవారం ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదు కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు. రాజవొమ్మంగి అక్టోబరు 26 నుంచి 30 వరకు, అడ్డతీగల అక్టోబరు 30 నుంచి నవంబరు 6 వరకు, వై.రామవరం నవంబరు 7 నుంచి 10 వరకు, గంగవరం నవంబరు 11 నుంచి 14 వరకు, దేవీపట్నం నవంబరు 15 నుంచి 18 వరకు, రంపచోడవరం నవంబరు 19 నుంచి 23 వరకు, మారేడుమిల్లి నవంబరు 24 నుంచి 26 వరకు, చింతూరు నవంబరు 27 నుంచి నవంబరు 30 వరకు, కూనవరం డిసెంబరు 1నుంచి 4 వరకు, వీఆర్‌పురం డిసెంబరు 5 నుంచి 7 వరకు, ఎటపాక డిసెంబరు 8 నుంచి 12 వరకు సభ్యత్వ నమోదు చేపట్టాలని కోరారు.

కామ్రేడ్ సత్యనారాయణకు నివాళి



వీఆర్ పురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు పూనెం సత్యనారాయణ పార్థివ దేహానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యనారాయణ సీపీఎం మండల కార్యదర్శిగా, డివిజన్ నాయకుడిగా, ప్రస్తుతం జిల్లా కమిటీ సభ్యుడిగా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నారన్నారు. గిరిజన, గిరిజనేతర పేద ప్రజల కోసం పోరాడిన యోధుడని, పోలవరం నిర్వాసితుల పక్షాన పొలికేక ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. అనంతరం సంతాప సభ నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, జిల్లా, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

రబ్బరు రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

మారేడుమిల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని రబ్బరు రైతులు ఆర్థికాభివృద్ధి పొందేలా చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. గురువారం ఆయన మండలంలోని పందిరిమామిడి కోటలో రబ్బరు రైతులతో సమావేశం నిర్వహించారు. మారేడుమిల్లి,వై.రామవరం మండలాల్లో రబ్బరు సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించా మని, రబ్బరు మొక్కల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ఐటీడీఏ ద్వారా పంపిణీ చేసినట్టు తెలిపారు. త్వరలో సాగుపై రైతులకు అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. రబ్బరు పాలు ప్రాసెసింగ్ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌వో చిట్టిబాబు, పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి, గొర్లె అనిల్ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

'పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి'

వీఆర్ పురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలంటూ టీడీపీ మండల నాయకులు గురువారం పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళ వందనను కలిసి వినతిపత్రం అందించారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొర్ర నరేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో పెండింగులో ఉన్న ఇళ్ల సర్వేలు, స్ట్రక్చర్ వాల్యూ పూర్తిచేసి నిర్వాసితులకు నష్టపరిహారం త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీఆర్ పురం బీసీ కాలనీలో ఇళ్ల సర్వే చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బొర్ర నరసింహరావు, ముత్యాల సిద్దు, పట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోలవరం స్పెషల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

నేడు బోటింగ్ కార్యకలాపాలపై అవగాహన

దేవీపట్నం/రంపచోడవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవీపట్నం మండలంలోని పి.గొం దూరులో గండిపోశమ్మ బోటింగ్ పాయింట్ వద్ద శుక్రవారం బోటింగ్ కార్యకలాపాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు సబ్ కలెక్టర్ కల్పశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి నదిలో బోటింగ్ కార్యకలాపాల్లో ఏ విధమైన భద్రత చర్యలు పాటించాలి, హఠాత్తుగా ఏదైనా ప్రమాదం క్షతగాత్రులను జరిగే ప్రమాదానికి గురైన వారిని ఎలా రక్షించాలి తదితర విషయాలపై రాష్ట్ర విపత్తు సహాయకదళం మాక్ డ్రిల్ నిర్వహిస్తుంది. బోట్ల ఓనర్స్, రెవెన్యూ, పోలీస్, అటవీ, అగ్నిమాపక, ఇరిగేషన్, మత్స్య, వైద్య శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

వరి కోతలు ప్రారంభం

• యంత్రాలతోనే అధిక శాతం

జగ్గంపేట, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో అక్టోబరు చివరి వారంలో తొలకరి పంటలు చేతికి రావడంతో వాటిని ఒబ్బిడి చేసుకునే పనుల్లో రైతులు ఉన్నారు. వరి కోత మిషన్‌ను రప్పించుకుని త్వరితగతిన పంటను కోయించుకునే పనిలో రైతాంగం ఉన్నారు. ఇప్పటికే గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో రైతాంగం మిషన్ కోతతో పంటలు ఒబ్బిడి చేసుకునే పనుల్లో బిజీబిజీగా ఉండగా జగ్గంపేట మండలం మెట్ట, పల్లపు ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీపావళి ముందు రైతు ఇంట సిరులు కురిపించే వరి చేతికందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాడి రైతులకు మట్టుకు పశుగ్రాసానికి కొంచెం ఇబ్బంది కలిగే పరిస్థితి. గతంలో కోతలు మనుషులతో కోయించే వారు, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని అంతా మిషన్లతోనే కోయించడంతో వరిగడ్డి కొరత ఏర్పడుతుంది.



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట



మల్లేపల్లిలో ధాన్యం బస్తాలు లోడ్ చేస్తున్న రైతులు

మెట్టలో ముమ్మరంగా వరి కోతలు

గండేపల్లి, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలంలో రైతులు వరి కోతలు ముమ్మరంగా ప్రారంభించారు. గత నాలుగైదు రోజుల నుంచి మిషన్‌తో కోతలు కోసి ధాన్యాన్ని మిల్లర్లకు, రైతు భరోసా కేంద్రాలకు తరలించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మళ్లీ తుఫాన్ హెచ్చరికలు ఉండటంతో పంటలు నష్టపోతామని కోతలు వేగవంతంగా మొదలు పెట్టారు. మండలంలో సుమారు 6735 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తే ఇప్పటికి 750 ఎకరాల్లో కోతలు కోసి మిల్లర్లకు తరలించారు. దిగుబడి కూడా ఎకరానికి 30 బస్తాలు వచ్చాయని, ధాన్యం నాణ్యతను బట్టి రూ.1500 ఉంటుందన్నారు. ముసాబు లేకపోతే ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటామని రైతులు తెలుపుతున్నారు.

భక్తులకు దీక్షా వస్త్రాలు, మాలలు అందజేత

జగ్గంపేట, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట చెరువుగట్టుపై ఉన్న అమ్మవారి ఆలయం మర్రి మొక్క వీధిలో గురువారం అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ ఐవీ రోహిత్ ఆదేశాలతో జగ్గంపేట చుట్టుప్రక్కల జగ్గంపేట, మల్లిశాల, ఇర్రిపాక, కాట్రావులపల్లిలో భక్తులకు ఉచితంగా దీక్ష వస్త్రాలు, పూజా పుస్తకాలు, స్వామి వారి మాల, ఫోటో అందజేశారు. ఈ సందర్భంగా సత్యదీక్ష ప్రచార కర్త కృష్ణబాబు మాట్లాడుతూ 2002 నుంచి సత్యదీక్షకి శ్రీకారం చుట్టి గ్రామగ్రామాన అప్పటి నుంచి నుంచి ప్రచారం చేస్తున్నామన్నారు.

ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం వద్దంటూ ఆందోళన



ఏలేశ్వరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు

ఏలేశ్వరం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం వద్దంటూ పట్టణంలో ప్రజలు ఆందోళన చేపట్టారు. గురువారం స్థానిక మెయిన్‌రోడ్డులో 12వ వార్డులో ఇళ్ల మధ్యలో మద్యం దుకాణాలు వద్దంటూ మహిళలు పెద్దసంఖ్యలో ఆందోళన నిర్వహించారు. వీరికి మద్దతుగా నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ పైల సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ పాల్గొని ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి ఆందోళన చేశారు. స్థానిక ప్రజలకు మద్దతుగా నిలిచారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం ఉండ టంవల్ల స్థానికంగా ఉండే మహిళలకు, విద్యార్థులకు రక్షణ కరువవుతుందన్నారు. మద్యం దుకాణాలు ఊరికి దూరంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సిరిపురపు రాజేష్, జామి ఆదినారాయణ, మహిళలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఉపాధ్యాయుడిగా చూడాలి

• టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గంలో విద్యార్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయుడిగా చూడడమే జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ధ్యేయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి పేరు మీద ఫౌండేషన్ ఏర్పాటు చేసి అనేక సేవలు చేసుకుంటూ వస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే టీడీపీ అధికారంలోకి వచ్చిన పార్టీ అధినేత తొలి సంతకం డీఎస్సీ మీద పెట్టడంతో జగ్గంపేట నియోజకవర్గంలో విద్యార్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఉచితంగా టెట్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి సుమారు 600 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇచ్చామన్నారు. శుక్రవారం నుంచి 110రోజులు డీఎస్సీ కోచింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోచింగ్‌ను నియోజకవర్గంలో ఉన్న అర్హత కలిగిన ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఫౌండేషన్ పేరుమీద తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెళ్లి కానుక అనే పథకం అమలు చేశామని ఈ పథకం పేరు మీద రూ.20వేలు పెళ్లి మండపం వద్దకు తన ఫౌండేషన్ సభ్యులు వచ్చి అందజేస్తున్నారని ఎవరైనా వివాహం చేసుకునే వారు 9 రోజుల ముందు సమాచారం అందజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, ఎస్‌వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, వేముల కొండ జోగారావు పాల్గొన్నారు.

• ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎన్నికల్లో భాగంగా ఉభయగోదావరి జిల్లాకి సంబంధించి జిల్లాకి చెందిన పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించేందుకు కూటమి ప్రభుత్వ నాయకులు ప్రతిఒక్కరు కృషి చేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు గ్రాడ్యుయేట్ చేసి అక్టోబరు నెలకు 3 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఉద్యానవన పంటలు, నూతన వ్యవసాయ పద్ధతులపై సదస్సు

గండేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఉద్యానవన పంటలు నూతన వ్యవసాయ పద్దతులు అనే అంశంపై సదస్సు నిర్వహించినట్లు విభాగాధిపతి డాక్టర్ బి.కృష్ణకాంత్ తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ బి.నీరజ ప్రభాకర్ పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు అడ్వాన్స్ టెక్నాలజీను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని ఉద్యానవన పంటలు నూతన విధానాన్ని గురించి తెలుసుకోవాలని వివరించారు. ఈ సదస్సులో ఆదిత్య యూనివర్శిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో కుక్క, పాము కాటు మందులు



డాక్టర్ నరేష్

గండేపల్లి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి పీహెచ్‌సీలో కుక్క, పాము కాటు మం దులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల టెస్టులు కూడా పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి డబ్బు వృథా చేసుకోవద్దన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

• తుని ఎమ్మెల్యే యనమల దివ్య



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా తమతో కలిసి రావాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య పార్టీ నాయకులను, కార్యకర్తలను కోరారు. తేటగుంటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయి సమస్యలు ప్రభుత్వ పథకాలు అమలుతీరు తదితర అంశాలపై చర్చించారు.టీడీపీ నాయకులు సుర్లలోవరాజు, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటిసత్యనారాయణ, చింతమనీడి అబ్బాయి, తటపర్తి రాజా, కుక్కడపు బాలాజీ, లక్క సునీల్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, చినబాబు, రాంబాబు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రౌతులపూడి విద్యార్థుల ఎంపిక

రౌతులపూడి, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్ 14 బాలుర, బాలికల పోటీలు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల్లో గురువారం జరిగాయి. ఈ పోటీల్లో రౌతులపూడి జిల్లాపరిషత్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతికి చెందిన శ్రీరామ్‌రెడ్డి కుశరాజు లాంగ్‌జంప్‌లో ప్రథమస్థానం, షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం పొందారు. 8వ తరగతికి చెందిన గొరికిపూడి అభినయ్ డిస్కస్‌త్రోలో ప్రథమ స్థానాన్ని సాధించాడు. వీరిద్దరూ వచ్చే నవంబరు నెల 6,7 తేదీలల్లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఆడతారని ప్రధానోపాధ్యాయుడు కోలరాంబాబు తెలిపారు. వీరు ఎంపికపట్ల విద్యార్థులు తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

తైక్వాండో పోటీలలో విద్యార్థినుల ప్రతిభ

అన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న కాకినాడలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ మెన్ అండ్ ఉమెన్ తైక్వాండో పోటీలలో అన్నవరం సత్యదేవా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు జి.మౌనిక, లావణ్యలు బంగారు పతకం, ఆర్.రేష్మ కాంస్యపతకం సాధించినట్లు పీఈటీ జి.నాగమణికంఠ తెలిపారు. మౌనిక ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైందన్నారు. పురుషుల విభాగంలో ఏ.విష్ణు కాంస్యపతకం సాధించగా ప్రిన్సిపాల్ రామ్మోహనరావు అభినందించారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కోటనందూరు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు దరఖాస్తులు తీసుకుంటున్నామని తుని డిపో మేనేజర్ తెలిపారు. జిల్లాలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్ ట్రేడ్‌లో ఖాళీలున్నాయని తెలిపారు. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బొర్రంపాలెంలో రీ సర్వే గ్రామసభ

గండేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో గురువారం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో పలు సమస్యలపై 13 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

చింతూరు

ఎంపీడీవోగా చైతన్య

చింతూరు, అక్టోబరు 24: చింతూరు ఎంపీడీవోగా చైతన్య నియమితులయ్యారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో విధులు స్వీకరించారు. మోతుగూడెం కార్యదర్శి గుంపెనపల్లి మోహన్, చింతూరు కార్యదర్శి ప్రసాద్ చైతన్యను ఆహ్వానించి పరచయం చేసుకున్నారు. చైతన్య కోనసీమ జిల్లా ఐ.పోలవరం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. కాగా ఇప్పటివరకు చింతూరు ఎంపీడీవోగా పనిచేసిన రవిబాబు కృష్ణా జిల్లా తిరువూరు బదిలీ అయ్యారు.



చైతన్యకు స్వాగతం పలుకుతున్న పంచాయతీ కార్యదర్శులు



పోలీసులకు సూచనలిస్తున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

పోలీస్‌స్టేషన్ సందర్శించిన చింతూరు ఏఎస్పీ

వై.రామవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా రంపచోడవరం ఇన్‌చార్జి ఏఎస్పీగా గురువారం వై.రామవరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించి గ్రామాల్లో జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు పోలీసులు కృషి చేయాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఆర్‌పీఎఫ్ పోలీసు విభాగాలను, బందోబస్తును పరిశీలించారు. కార్యక్రమంలో అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు కాలువల ద్వారా నీరందించాలి

అన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ఆరెంపూడి రెవెన్యూలో ఉన్న బెజవాడ చెరువు, అత్తి నారాయణ చెరువులకు పుష్కరకాలువ నుంచి నీరందించి ఎన్నికలు నిర్వహించాలని రైతు నాయకుడు సోము రాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల పుష్కరకాలువ డీపీ 14కు ఎన్నిక ప్రకటనపై ఆయన మండిపడ్డారు. ముందు రైతులకు న్యాయం చేయాలని ఆరేళ్లుగా దీనిపై పోరాటం చేస్తున్నామన్నారు. ఈ డీపీ 14కు తూరను ఏర్పాటుచేసినా నీరు పారేందుకు కాలువ ఏర్పాటు చేయలేదన్నారు. దీనిపై ఆరేళ్ల క్రితం అప్పటి ఆర్థికమంత్రిగా ఉన్న యనమల రామకృష్ణుడుకు తమ విజ్ఞాపన అందించామని అన్నారు. పుష్కరకాలువ నుంచి ఈ రెండు చెరువులకు సర్వేనెం. 190/1లో 0.54 ఎకరాల భూమి ఉందని రికార్డులు ఉన్నా నీరు పారేందుకు అవకాశం కల్పించలేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, సాగునీటి సంఘ ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళతామని అన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఏలేశ్వరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మెప్మా చేయూతనివ్వాలని టీఎంసీ సాయికుమార్ అన్నారు. పట్టణంలో మెయిన్‌రోడ్డులో గురువారం పట్టణ నిర్మూలన సంస్థ ఆధ్వర్యం లో అర్బన్ మార్కెట్ ఏర్పాటుచేశారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు తయారుచేసిన వెదురుబుట్టలు, తినుబండారాలు, పినాయిల్, దుస్తులు తదితర వస్తువులు మెప్మా మార్కెట్‌లో అమ్మకాలు చేశారు. టీఎంసీ సాయికుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి మెప్మా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల ఆర్పీలు ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

ప్రత్తిపాడు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని ఎన్నికల్లో అధికార కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ఒత్తిడి తీసుకొస్తామని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు చెప్పారు. మండలంలోని పోతులూరు గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామంలోని వైసీపీ నాయకులను, అభిమానులను కలుసుకుని అనంతరం ఆపరేషన్ చేయించుకున్న కొల్లు ముసలయ్యను పరామర్శించారు. శెట్టి సత్తిబాబు, రేఖ కృష్ణార్జున, బాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై అవగాహన

ప్రత్తిపాడు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడు నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు నడుం కట్టారు. నియోజకవర్గం వ్యాప్తంగా 10వేల మంది పట్టభద్రులైన ఓటర్లను నమోదు చేయాలనే లక్ష్యాలు నిర్ణయం చేయడంతో గ్రామాల్లో టీడీపీ నాయకులు దీనిపై ప్రత్యేక దృష్టిసారించారు. ఈ క్రమంలో గురువారం ధర్మవరంలో టీడీపీ నాయకులు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు పట్టభద్రుల వద్దకు తరలివెళ్లి ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై వివరించి నమోదు కార్యక్రమాలు చేపట్టారు.

ధర్మవరం హైస్కూల్లో హ్యాండ్ బోరు పునరుద్ధరణ

ప్రత్తిపాడు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం హైస్కూల్లో మరమ్మతులకు గురైన హ్యాండ్ బోర్‌కు పాఠశాల విద్యాకమిటీ మరమ్మతులు నిర్వహించి తిరిగి పునరుద్ధరించింది. ఈ హ్యాండ్ బోరును ఈహైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్ రామకుర్తి నాగబాబు ప్రారంభించారు. హైస్కూల్లోని విద్యార్థుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మగ్గం వర్క్‌పై శిక్షణ

గండేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.నాయకంపల్లిలో డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మగ్గంపై వర్క్ శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. విద్యార్థినులు, మహిళలు కలిపి 50 మంది శిక్షణకు హాజరయ్యారు.

